

కరోనా విలయం.. ఓ చేదు జ్ఞాపకం!

లాక్‌డౌన్.. నేటికి ఐదేళ్లు

పూర్వం ప్లేగు, మశూచి, క్షయ వచ్చిన వారిని ఎక్కడో ఊరిచివర ఉంచేవారని, వారిని చూడడానికి రక్తబంధువులే వెళ్లే వారు కాదని చరిత్రలో చదువుకున్నాం. అయితే ఇప్పటి తరానికి అటువంటి దృశ్యాలను కళ్లారా చూపింది ఓ వ్యాధి. సమాజంలో ఒకరి చూసి మరొకరు భయపడే పరిస్థితి కల్పించింది. రక్తబంధువులే మృతదేహాలను పట్టుకోవడానికి, సమీపంలోకి రావడానికి భయభ్రాంతులకు గురయ్యారు. ఆ వ్యాధి పేరే కరోనా. దీనిని కట్టడి చేసేందుకు ఐదేళ్ల క్రితం ఇదే రోజున లాక్‌డౌన్ విధించారు. అప్పటి భయానక పరిస్థితులు నేటికీ జనాన్ని వెంటాడుతూనే ఉన్నాయి.

ఏలూరుక్రైం/తణుకు రూరల్/తాడేపల్లిగూడెం రూరల్/భీమవరం క్రైం/ నరసాపురం/పాలకొల్లు,మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా మానవ జీవితాలను అతలాకుతలం చేసి చరిత్రలో కొవిడ్-19 చేదు జ్ఞాపకంగా మిగిలిపోయింది. ఎక్కడో చైనా లోని వూహాన్‌లో పుట్టిన కరోనా వైరస్ ఖండాలు దాటి మానవాళిని భయభ్రాంతులకు గురి చేసి జీవవిధానాన్నే మార్చేసింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, భీమవరం, తణుకు ప్రాంతాల నుంచి కొంతమంది ముస్లింలు ఢిల్లీలోని ఒక మసీదు వద్ద జరిగిన ప్రార్థనలకు 2020 మార్చి 14న వెళ్లి 19న వచ్చారు. తిరిగి వచ్చిన వ్పటి నుంచి అనారోగ్యానికి గురికావడంతో మార్చి 30న పరీక్షలు నిర్వహించారు. ఏప్రిల్ 1న మొత్తం ఒకేసారి 19 కేసులను గుర్తించడంతో జిల్లా ఉలిక్కి పడింది. వారందరినీ ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ఆ తర్వాత వ్యాధి క్రమేపీ అన్ని ప్రాంతా లకు పాకింది. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో సుమారు 1800 మంది మృత్యువాత పడ్డారు. వీరిలో చాలా మంది మృతదేహాలను తీసుకెళ్లకపోవడంతో చివరకు ప్రభుత్వమే దహనాలు చేయించింది. మృతదేహాలను తీసుకెళ్లితే దహన ఖర్చుల నిమిత్తం రూ.15వేలు అందించింది. కరోనాలో మృతి చెందిన ప్రతి ఒక్కరి పేరిట కుటుంబ సభ్యులకు రూ.50 వేలను ఆర్థిక సాయంగా అందించింది. తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయిన చిన్నారులు 13 మంది ఉన్నారు. లాక్‌డౌన్ కారణంగా రోజూ వారీ కూలీ పని చేసుకుంటేనే గానీ పూట గడవని అనేక కుటుంబాలకు దాతలు,స్వచ్ఛంద సంస్థలు అందించిన సహాయం మరువలేం. నిత్యావసర వస్తువులు, బియ్యం అందజేసి ఆదుకున్నారు.



అత్తిలిలో మూసివేసిన రోడ్డు (ఫైల్)

కొవిడ్ -19 పరిణామాలు

కొవిడ్-19 వల్ల మానవ జీవితంలో అనేక మార్పులు వచ్చాయి. ముఖ్యంగా లాక్‌డౌన్ కాలంలో ఉద్యోగులు, విద్యార్థులకు ఆన్‌లైన్ పని, ఆన్‌లైన్ స్టడీలు కొత్తగా ప్రవేశించాయి. దీనితో చాలామంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తమ ఇంటి నుంచే విధులు నిర్వర్తించి జీతాలు పొందే అవకావం కల్పించారు. ఇప్పటికీ కొన్ని సంస్థల్లో ఇంటి నుంచే పని చేసే విధానం అమలవుతోంది. కొవిడ్ కాలంలో విద్యార్థులకు సూచించిన ఆన్‌లైన్ విద్యా విధానంతో విద్యార్థులలో అనేక మార్పులు వచ్చాయి. ఆన్‌లైన్‌లో మొబైల్‌లోనే పాఠాలు చదవడం, రాయడం వంటి చేయడం వల్ల పుస్తక పఠనంపై విద్యార్థులకు ఆసక్తి తగ్గిపోయింది. మరోవైపు ప్రస్తుతం యువత పూర్తి స్థాయిలో మొబైల్ ఫోన్‌లకు బానిసలుగా మారిపోయారు. యువతతో పాటు చిన్నారులు మొబైల్ చూడకుండా ఉండలేక పోతున్నారు. మరోవైపు వీటితో పాటు ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధవహిస్తున్నారు. పోషకాహారం తినాలనే అవసరం ఏర్పడింది. ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, ఆచరించడం వంటి అలవాట్లు ఎక్కువ మందిలో ఏర్పడింది.



ఏలూరులో రెడ్‌జోన్ (ఫైల్)

- సరిగ్గా ఐదేళ్ల క్రితం ఇదే రోజున కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కరోనా వ్యాధి నియంత్రించడానికి లాక్‌డౌన్ ప్రకటించిన రోజు. 2020 మార్చి 22న జనతాకర్ఫ్యూ అని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. ఆ మరుసటి రోజే దేశ వ్యాప్తంగా నెల రోజుల పాటు లాక్‌డౌన్ అంటూ ప్రకటించారు. భారత దేశంలో మొత్తం ఐదు లాక్‌డౌన్‌లు కరోనా పేరిట జరిగాయి. 2020 మార్చి 25 నుంచి ఏప్రిల్ 14 వరకు (21 రోజులు), రెండో దశగా ఏప్రిల్ 15 నుంచి మే 3వ తేదీ వరకు (19 రోజులు), మూడో దశగా మే 4 నుంచి 17 వరకు (14 రోజులు), నాల్గో దశగా మే 18 నుంచి 31 వరకు (14 రోజులు), ఐదవ దశగా జూన్ 1 నుంచి జూన్ 30 వరకు (30 రోజులు) లాక్‌డౌన్లను ప్రకటించారు. లాక్‌డౌన్ ఉప సంహరణను మాత్రం 22 దశలుగా 2021 అక్టోబరు ఆఖరు నాటికి ఉప సంహరించారు. లాక్‌డౌన్ కాలంలో అత్యవసర సర్వీసులు మినహా మిగిలిన వారెవ్వరూ ఇళ్ల నుంచి బయటకు రాకూడదని నిషేధాజ్ఞలు విధించారు. కరోనా సోకిన ప్రాంతంలో రెడ్‌జోన్లు గా ప్రకటించి పోలీసు పహరాతో నిర్బంధం విధించారు. అక్కడి వారందరినీ క్వారంటైన్ సెంటర్లకు 15 రోజుల పాటు నిర్బంధంలో ఉంచి పరీక్షలు చేసిన అనంతరం పంపించేవారు. రోడ్లపై జన సంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. ప్రజా రవాణా వ్యవస్థలైన రైల్వే, ఆర్టీసీ, విమాన సర్వీసులను ప్రభుత్వమే నిలిపివేసింది. కేవలం ప్రభుత్వ వైద్యశాలలకు మాత్రమే మినహాయింపు ఇచ్చారు. స్వాతంత్ర్య భారత దేశంలో 1947లో దేశ విభజన తర్వాత ఆస్థాయిలో ప్రజా జీవనంపై ప్రభావం చూపిన ఘటనగా ఈ జనతా కర్ఫ్యూ చరిత్రలో నిలిచిపోయింది.



భీమవరంలో లాక్‌డౌన్‌తో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు (ఫైల్)



గణపవరం మండలంలో రోడ్లపై బ్లీచింగ్ (ఫైల్)

కరోనా ..విషాదాంతాలు

- భీమవరానికి చెందిన ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి రాము (పేరు మార్చాం) కొవిడ్‌కు ముందు భారీగా పొలాలు కొనుగోలు చేసి వెంచర్లు వేశాడు. అప్పులు చేసి కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టాడు. కొవిడ్ రావడంతో లాక్‌డౌన్ విధించారు. వెంచర్లు అమ్ముడుకాలేదు. అప్పులకు వడ్డీలు భారీగా పెరిగాయి. చివరకు ఏమి చేయాలో తోచని పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకున్నాడు. అతని కుటుంబం రోడ్డునపడింది. అప్పులు ఇచ్చినవారు ఆ వెంచర్లను స్వాధీనం చేసుకున్నారు.
- భీమవరం సమీపంలో పాలకోడేరు మండలానికి చెందిన సతీష్ (పేరు మార్చాం) వ్యాపారంలో బాగా డబ్బు సంపాదించాడు. ఇద్దరు కుమార్తెల్లో పెద్ద కుమార్తెకు వివాహం చేయడానికి మంచి సంబంధం చూశాడు. ఇంతలో లాక్‌డౌన్ రావడంతో సీన్ రివర్స్ అయ్యింది. వ్యాపారంలో బాగా నష్టం వచ్చింది. అనుకున్న కట్నం ఇవ్వలేకపోయాడు. దానికితోడు అతనికి కొవిడ్ సోకి ఆస్పత్రిలో కన్నుమూశాడు. పెళ్లి రద్దయింది. ఆ కుటుంబం పరిస్థితి చిన్నాభిన్నం అయ్యింది. పిల్లలు ఇద్దరూ జీతానికి పని చేస్తున్నారు.
- పాలకొల్లు మండలం గొల్లవానిచెర్వుకు చెందిన ఒకే కుటుంబంలోని ముగ్గురు కేవలం వారం వ్యవధిలో కొవిడ్ మహమ్మారి కారణంగా మృత్యువాత పడ్డారు. కరోనా చికిత్స పొందుతూ ఇంటి యజమాని మృతిచెందగా మూడు రోజులు వ్యవధిలో అతడి భార్య, మరో మూడు రోజులు వ్యవధిలో అతని తల్లి మృతి చెందారు.



- పాలకొల్లుకు చెందిన ముగ్గురు అన్నదమ్ములు కరోనాతో ఇరవై రోజుల వ్యవధిలో మృతి చెందారు.
- పాలకొల్లు టెలిఫోన్ ఎక్సేంజ్ ప్రాంతంలో వృద్ధ దంపతుల్లో భార్య తెల్లవారు జామున మృతి చెందగా ఆరోజు సాయంత్రానికి భర్త మృతి చెందారు.
- భీమవరం సమీపంలోని ఓ గ్రామంలో ఓ ఇంటిలో యజమానికి కరోనా వచ్చింది. దాంతో ఆ ఇంట్లో అందరికీ కరోనా పరీక్షలు చేయగా భార్యకు కరోనా వచ్చిందని తేలడంతో వారిద్దరిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా కరోనాతో పోరాడి చివరికి ఆస్పత్రిలోనే కన్నుమూశారు. వారి మృతదేహాలను ఇంటికి తీసుకొచ్చే అవకాశం లేక బయటే ఖననం చేశారు. పిల్లలకు చివరిచూపు దక్కకపోవడంతో పిల్లల రోదన వర్ణనాతీతం.
- ఏలూరునకు చెందిన ఒక కుటుంబంలో తల్లిదండ్రులతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తండ్రి ఒక కొరియర్ సంస్థలో పనిచేస్తూ తన భార్య, పిల్లలను పోషించేవాడు. అతనికి కరోనా సోకి కోలుకోలేక ప్రాణాలు కోల్పోయాడు. ఇద్దరు ఆడ పిల్లలతో ఆ తల్లి తల్లడిల్లిపోయింది. కాస్త చదువుకోవడంతో ఇంటి వద్దే విద్యార్థులకు ట్యూషన్లు చెప్పుకుంటూ తమ పిల్లలను చదివించుకుంటోంది. ఆ బిడ్డలకు ప్రభుత్వం నుంచి ఏదైనా సహాయం అందితే చిన్నపాటి వ్యాపారం చేసుకుని పిల్లలను ప్రయోజకులను చేయాలని ఆ తల్లి ఆశపడుతోంది.
- ఏలూరులోని ఒక వ్యాపారం నిర్వహిస్తున్న యజమానికి కరోనా వచ్చి మరణించగా ఆయన భార్య, పెళ్లికాని కుమారుడు కరోనాతోనే మరణించాడు. చివరకు కుమార్తె అమెరికాలో ఉండడంతో ఆమె వచ్చి చూసి తల్లడిల్లిపోయింది. ఇలాంటి కుటుంబాలు మరెన్నో. జంగారెడ్డిగూడెం మండలంలోను ఇలాంటి ఘటనలే ఉన్నాయి.

- నరసాపురానికి చెందిన ఓ పండ్ల వ్యాపారి ఉపాధి లేక రెండు నెలల పాటు ఆర్థికంగా కష్టాలు పడ్డారు. దాతలు ఇచ్చిన సాయంతోనే ఒక పూట తిని మరో పూట పస్తులతో ఉన్నారు. ఇక రెడ్ జోన్‌లో ఉన్నవారి పరిస్థితి మరింత దయనీయం. రెడ్ జోన్ వచ్చిదంటే.. చాలు 20 రోజుల వరకు బయటకు రాలేని పరిస్థితి. ఆ రోజుల్ని తలుచుకుంటేనే భయం వేస్తోందని పాతబజార్ ప్రాంతానికి చెందిన మౌలాలీ అప్పటి భయానక రోజులను గుర్తు చేసుకున్నాడు.
- అప్పట్లో తాడేపల్లిగూడెంలోని జర్నలిస్టులకు కరోనా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో 57 మంది పరీక్షించుకోగా వారిలో 20 మందికి పైగా కరోనా పాజిటివ్ రావడంతో వారందరిని తాడేపల్లిగూడెం శివారు టిడ్కో ఇళ్ల వద్దకు తరలించారు. వారిలో ఓ జర్నలిస్ట్ సుధీర్ భయపడుతూనే ఏడు రోజులు క్వారంటైన్‌లో గడిపాడు. రెండోసారి పరీక్షలు చేస్తే కరోనా లేదని వైద్యులు చెబితే కొందరు హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకోగా సుధీర్‌కు మాత్రం మళ్లీ కరోనా పాజిటివ్ రిపోర్టు రావడంతో హడలిపోయాడు. మరో ఓవారం క్వారంటైన్‌లోనే గడిపి కరోనా లేదని నిర్ధారించుకున్నాక బయటకు వచ్చాడు.



వ్యాపారం సర్వనాశనం

సరిగ్గా ఐదేళ్ల క్రితం లాక్‌డౌన్ విధించడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇంటి నుంచి బయటకు రాని పరిస్థితి. వ్యాపారాలు లేక అవస్థలు పడ్డాం. అద్దెలు చెల్లించలేని పరిస్థితి. ఇంట్లో గడవాలంటేనే అగమ్యగోచరం. కొవిడ్-19 మహమ్మారి మళ్లీ రాకుండా ఉంటేనే అందరం బాగుంటాం. లేనిపక్షంలో ఇబ్బందులు తప్పవు.

- జి. విఠాబాశంకర్, వ్యాపారి, భీమవరం



వ్యాపారాలు కోలుకోలేదు

కొవిడ్-19 చాలామంది జీవితాలను నాశనం చేసింది. లాక్‌డౌన్‌లో పాలప్యాకెట్ వద్ద నుంచి నిత్యావసరాల వరకు అన్నీ అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. అప్పటి నుంచి ఇప్పటి వరకు వ్యాపారాలు కోలుకోలేదు. చాలామంది అప్పట్లో ఖరీదైన వైద్యానికి అప్పుల పాలయ్యారు.

- బి. షావుకారు, వ్యాపారి, భీమవరం

ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టపోయాం



లాక్‌డౌన్‌తో చిరు వ్యాపారాలు దెబ్బ తిన్నాయి. దీనికి తోడు కొవిడ్ 19తో బాధ పడుతూ కార్పొరేట్ వైద్యం కోసం రూ.లక్షలు ఖర్చు చేయడంతో ఇప్పటికీ ఆ అనారోగ్య కారణంగా అనేక ప్రతి కూలతలతో జీవిస్తున్నాం. డయాబెటిక్ సమస్యలతో బాధపడుతున్న నాకు కొవిడ్ వ్యాక్సిన్ కారణంగా ఏర్పడిన సమస్యల కారణంగా కార్పొరేట్ ఆస్పత్రి రూ. 8 లక్షలు ఖర్చు వ్యయం అయింది. అనంతరం కిడ్నీ సమస్యలతో మళ్లీ ఆస్పత్రికి వెళ్తే మరో రూ.5 లక్షలు ఖర్చు అయింది. ఇంకా ఆరోగ్యం కుదుట పడలేదు. కొవిడ్ మహమ్మారితో ఆరోగ్యంగా, ఆర్థికంగా నష్టపోయాం.

-సన్నిధి శ్రీలత, పైడిపర్రు, తణుకు



నాకు ఇది పునర్జన్మ...

జీవితం మీద ఆశలు పోయాయి. బతుకుతానని అనుకోలేదు, డాక్టర్లు కష్టమని చెప్పడం విన్నా. 15 రోజులు మంచంపై ఉన్నా. చివరికీ నన్ను ఇంటికి తీసుకెళ్లిపోమని డాక్టర్లు మా కుటుంబ సభ్యులకు చెప్పారు. అప్పటి వరకు ప్రాణమీద ఉన్న చిన్న ఆశ కూడా పోయింది. ఈ సమయంలో నా మిత్రుడు సందీప్ నాలో ధైర్యం నింపాడు. మరో ఆస్పత్రికి మార్చి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేశాడు. ఇది నాకు పునర్జన్మే. కొవిడ్ ప్రభావంతో ఇప్పటికీ ఆరోగ్యపరంగా ఏదో ఒక్క సమస్య వస్తూనే ఉంది. గతంలో మాదిరిగా ఉత్సాహవంతంగా ఉండలేకపోతున్నా.

- రామ్ గోపాల్ గోపి, ఫొటోగ్రాఫర్, నరసాపురం

కుటుంబంతో గడిపేందుకు ఇష్టపడుతున్నారు ..



కొవిడ్-19 తర్వాత ప్రతీ ఒక్కరూ తమ కుటుంబంతో ఎక్కువ సమయం గడిపేందుకు ఇష్టపడుతున్నారు. మానసిక ఒత్తిడికి సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు కడగడం, మాస్కులు ధరించడంపై అవగాహన పెరిగింది. ముఖ్యంగా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రొటీన్, మినరల్, విటమిన్లు సమాన స్థాయిలో వుండేలా పోషకాహారం తీసుకోవాలనే అవగాహన పెరిగింది.

పి.గోపాల కృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయుడు, పోషకాహార నిపుణుడు, తణుకు



కొవిడ్ అవశేషాలు మిగిలే వున్నాయి

కొవిడ్-19 బారిన పడి చికిత్స తీసుకున్న కొందరిలో ఆ వైరస్‌కు సంబంధించిన అవశేషాలు ఇంకా వున్నాయి. వారిలో దీర్ఘకాలిక జీవన శైలి రుగ్మతలను గమనిస్తున్నాం. మధుమేహం, బీపీ, థైరాయిడ్ వంటి సమస్యలు వున్నవారు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ, జంక్ ఫుడ్‌కు దూరంగా వుంటూ మితాహారం తీసుకోవడం ద్వారా ఆరోగాన్ని కాపాడుకోవచ్చు.

-డాక్టర్ కె.సాయి భవాని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, వేల్పూరు

27న సీఎం పోలవరం పర్యటన



- పనుల పరిశీలన, కీలక సమీక్ష
- ఇప్పటికే నిర్మాణంలో డయాఫ్రమ్ వాల్ పనులు
- నేడు ప్రాజెక్టును సందర్శించనున్న జిల్లా అధికారులు

(ఏలూరు- ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు. వైసీపీ జమానాలో ప్రాజెక్టు పనులు ఎక్కడి కక్కడ నిలిచిపోయాయి. కేంద్రాన్ని సైతం ఒప్పించి మెప్పించడంలో అడుగడుగునా నిర్లక్ష్యమే. అధికార పగ్గాలు చేపట్టిన తెలుగుదేశం గత తొమ్మిది నెలల వ్యవధిలోనే కేంద్రం కలిసివచ్చింది. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు సీఎం చంద్రబాబుకు అండగా నిలిచింది. పాత బకాయిలతో పాటు తాజాగా నిర్మాణం నిమిత్తం కోట్లాది రూపాయలు కేటాయించింది. ప్రాజెక్టు పనులు పరుగుల తీసేలా ఇప్పటికే కార్యాచరణ. పెండింగ్ పనులు, కొత్తగా నిర్మిస్తున్న డయాఫ్రమ్‌వాల్ పురోగతిని పరిశీలించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 27న ప్రాజెక్టు ప్రాంతానికి రానున్నారు. దీంతో అధికారులు ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించి తగు చర్యలకు సమాయత్తం అవుతున్నారు.

పూర్తి కావడమే లక్ష్యం

పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసే దిశగా లక్ష్యాలను నిర్దేశించారు. ఇంతకుముందు తెలుగుదేశం అధికారంలో ఉండగా ప్రాజెక్టు పనుల్లో 78 శాతం మేరకు పూర్తయ్యాయి. ప్రధాన ప్రాజెక్టు నిర్మాణం శరవేగంగా చేయాలని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దీనిలో భాగంగానే ఎగువ, దిగువ, కాఫర్ డ్యామ్‌ల నడుమ డయాఫ్రమ్ వాల్ నిర్మాణాన్ని రికార్డు సమయంలో పూర్తి చేశారు. కానీ వైసీపీ అధికారంలో ఉండగా జరిగిన నిర్లక్ష్యం కారణంగా డయాఫ్రమ్ వాల్ గోదావరి వరదలకు దెబ్బ తింది. దీనిని పునర్ నిర్మించాలని నిపు ణుల బృందం సిఫార్సు చేసింది. దీంతో ప్రాజెక్టు అనుకున్న సమయంలో పూర్తిచేయ డానికి జాప్యానికి దారితీసింది. రాష్ట్ర ప్రభుత్వం నిత్యం పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అను వైన పరిస్థితులపై కేంద్రంతో తరచూ చర్చిం చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ఒక వైపు ప్రధాని మోదీతో, ఇంకోవైపు కేంద్రమంత్రు లు ప్రత్యేకించి కేంద్ర జలవనరుల మంత్రితో భేటీ కావడంతో ప్రాజెక్టుకు అవసరమైన పలు అనుమతులే కాకుండా దాదాపు ఇవన్నీ పూర్తి కావడానికి అవసరమైన నిధులను సమకూర్చింది. దీంతో డయాఫ్రమ్ వాల్ నిర్మాణ పనులు గతేడాది డిసెంబరు 10న తిరిగి ఆరం భం అయ్యాయి. దీనినిమిత్తం 980 కోట్లకు పైగా వ్యయం చేయబోతు న్నారు. ఈలోపే ప్రాజెక్టు పరిధిలో మిగిలిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఏడాది ఆరంభంలో ప్రాజెక్టును సందర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు కాంటాక్టు ఏజెన్సీ, ఇంజనీర్లతో కీలక సమీక్ష చేశారు. ఇప్పటికే డయాఫ్రమ్ వాల్ నిర్మాణం 1,396 మీటర్ల నిడివిన, ఐదు మీటర్ల వెడల్పున నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

పోలవరం పనులపై సమీక్షించేందుకు, పరిశీలించేందుకు ఈ నెల 27న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాజెక్టును సందర్శించనున్నారు. ఇప్పటివరకు జరిగిన పనులు, పెండింగ్‌లో ఇంకా మిగిలిన పనులతో పాటు, కీలక నిర్ణయాలకు అనుగుణంగానే సమీక్ష చేయనున్నారు. సాధ్యమైనంత మేర 2027 నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాలన్న లక్ష్యానికి అనుగుణంగానే దిశా నిర్దేశం చేయనున్నారు. ఈ నెల 25,26వ తేదీల్లో కలెక్టర్ల సమావేశం పూర్తి చేసుకుని, ఆ మరుసటి రోజే పోలవరం రానుం డటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. పోలవరం వద్ద తాజా పరిస్థితు లను, ముఖ్యమంత్రి రాక సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ప్రాజెక్టును సోమవారం సందర్శించే అవకాశాలున్నాయి.

రెవెన్యూ సమస్యలకు చెక్

సదస్సుల్లో అందిన అర్జీలకు ప్రాధాన్యం

4,861 అర్జీలకు 4,816 పరిష్కారం

ఇప్పటి వరకు 99 శాతం పూర్తి

(ఏలూరు- ఆంధ్రజ్యోతి)

పల్లె, పట్టణం అనే తేడా లేకుండా పేరుకు పోయిన రెవెన్యూ సమస్యలకు అధికార యంత్రాంగం చెక్ పెడుతోంది. సీఎం చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్ల సదస్సు తేదీలను ఖరారు చేసిన నాటి నుంచి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం దిశగా వేగంగా అడుగులు పడ్డాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయ్యింది. బడా బాబులు, జిల్లా నేతలు వారికి కావాల్సిన పనుల కోసం, భూ దందాలకు కింద స్థాయి ఉద్యోగులతోనే పెద్దస్థాయి కేడర్‌లో కూర్చొబెట్టి సాఫీగా చేయించుకుని వ్యవస్థనే అస్తవ్యస్తం చేశారు. భూ సమస్యల పరిష్కారానికి గతేడాది డిసెంబరులో ప్రభుత్వం పెద్ద ఎత్తున రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అందరూ అధికారులు గ్రామంలోనే ఉండి సభను నిర్వహించి, అర్జీలను తీసుకుని వాటి పరిష్కార మార్గాలను అన్వేషించారు. వీటిని 45 రోజుల్లోనే పరిష్కరించాలని ఆదేశాలను ఇచ్చారు. భూ ఆక్రమణలను, సరిహద్దు తగాదాలు, మ్యుటేషన్లు, భూ రికార్డుల్లో మార్పులు, చేర్పుల సమస్యలపై అర్జీలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, అధికారులను వెంటాడింది. జిల్లా వ్యాప్తంగా 4,861 అర్జీలు మూడు రెవెన్యూ డివిజన్ల నుంచి అధికారులకు అందాయి. ఇందులో 4,816 అర్జీలను అధికారులు పరిష్కరించారు. ఇంకా 45 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 99 శాతం పైనే అర్జీలు పరిష్కారానికి నోచుకున్నాయి. ఇంకా 0.93 శాతం పరిష్కరించాల్సి ఉంది. డివిజన్‌ల వారీగా దరఖాస్తులను పరిశీలిస్తే... ఏలూరు డివిజన్‌లో 1,723 అర్జీలు రాగా 1,688 పరిష్కరించారు. జంగారెడ్డిగూడెం డివిజన్‌లో 1,865కు 1,857 సమస్యలు, నూజివీడు డివిజన్‌లో 1,273 అర్జీలకు 1,271 పరిష్కారమయ్యాయి.

రీ సర్వేకు దరఖాస్తుల వెల్లువ

జిల్లా అంతటా గత ప్రభుత్వంలో జరిగిన భూముల సర్వే అంతా లోపాల పుట్ట.. అనేది రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు, రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులే తేటతెల్లం చేశాయి. జిల్లా యంత్రాంగానికి తాజాగా కొద్ది నెలలు క్రితం అందిన దరఖాస్తుల్లో 4,861 ఉంటే.. ఇందులో సింహభాగం రీ సర్వే కోరుతూ మొత్తం 2,655 దరఖాస్తులు అందాయి. వీటికి అత్యధిక ప్రయారిటీ ఇచ్చిన రెవెన్యూ, సర్వేశాఖల అధికారులు 2,625 దరఖాస్తులను ఇటీవలే పరిష్కరించారు. ఇంకా 30 అర్జీలు పరిష్క రించాల్సి ఉంది. ఇతరత్రా చూస్తే కుల ధ్రువీకరణ తప్పులపై 462, మీ సేవల్లో జరిగిన వివిధ తప్పిదాలపై 990 అర్జీలు ఉన్నాయి. భూ సరిహద్దు గొడవలపై 49, ప్రభుత్వం పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములపై 50 దరఖాస్తులు అందగా, అన్నింటిని అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించారు. జేసీ ధాత్రిరెడ్డి రెవెన్యూ అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారం, వారం సమీక్షలు, జూమ్ కాన్ఫరెన్స్‌లతో పాటు డీఆర్వో ద్వారా మోనటరింగ్ చేయడంతో రెవెన్యూ సమస్యలు ఒక కొలిక్కి వచ్చాయి. కాగా ఈనెల 25,26వ తేదీల్లో విజయవాడలో కలెక్టర్ల సదస్సు జరగనుంది. జిల్లాలోని రెవెన్యూ సమస్యల పరిష్కారంపై సదస్సులో నివేదికలు సమర్పించనున్నారు.



31వ తేదీకి ముందుగానే ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి : జేసీ

ఏలూరుసిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 31వ తేదీకి ముందుగానే రేషన్ లబ్ధిదారుల ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లాలోని పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లను జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. ఈ ప్రక్రియను నూటికి నూరు శాతం పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 1,56,000 యూనిట్లు ఇంకా ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. దీనిని అమలు చేసేందుకు అనేక పద్ధతులు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామ వార్డు సచివాలయాల్లో , రేషన్ షాపులలో డీలర్ వద్ద ఉన్న ఈ-పాస్ పరికరాల ద్వారా, మొబైల్ యాప్ ద్వారా ఈకేవైసీ అప్‌డేట్ చేయించుకోవచ్చన్నారు. ఐదేళ్లలోపు పిల్లలు మినహా మిగిలిన లబ్ధిదారులు ఈకేవైసీ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలన్నారు. ఇది ముఖ్యంగా ప్రభుత్వ నిధులు , రేషన్ పంపిణీ వ్యవస్థను సక్రమంగా అమలు చేయడానికి, అక్రమ వినియోగాన్ని నివారించడానికి ఉపయోగపడుతుందన్నారు.



గాంధేయవాది కృష్ణభారతి మృతి

7

యువతిపై అత్యాచారం

- ఏడుగురిపై పోక్సో కేసు

దిక్సూచి DIKSUCHI



ఉమ్మడి ప్రిపరేషన్ బెస్ట్

ఇంటర్ పరీక్షలు పూర్తయ్యాయి. పోటీ పరీక్షలు మళ్లీ మొదలయ్యాయి. ఎంపీసీ విద్యార్థులు ఏప్రిల్ మొదటి వారంలో జేఈఈ మెయిన్ రెండో సెషన్‌కి హాజరు కావాల్సి ఉంది. తరవాత మేలో ఎంసెట్ పరీక్ష రాయాలి. జేఈఈకి దాదాపుగా 13.5 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా జనవరి సెషన్‌కి దాదాపుగా 11 లక్షల మంది హాజరయ్యారు. వీటి ఫలితాలు కూడా వెల్లడయ్యాయి. అదే సమయంలో రెండో సెషన్ రిజిస్ట్రేషన్ కూడా పూర్తయింది.

ఇంటర్ పరీక్షల తరవాత జేఈఈ రాసే విద్యార్థులకు సరిగ్గా రెండువారాల సమయం కూడా లేదు. అలాగే ఎంసెట్ పరీక్ష తెలంగాణలో మే 2 నుంచి 5 తేదీ వరకు జరగనుంది. ఆంధ్రప్రదేశ్‌లో అయితే మే 21 నుంచి 27 వరకు నిర్వహిస్తున్నారు. జేఈఈ, ఎంసెట్ రెండు ఎంట్రెన్స్‌లను దృష్టిలో పెట్టుకుని ఎలా సన్నద్ధం కావాలో చూద్దాం. సమయం తక్కువగా ఉంది కాబట్టి జేఈఈ విద్యార్థులు వెయిటేజీకి అనుగుణంగా చాప్టర్ల వారీగా రివిజన్‌ను ప్లాన్ చేయాలి.

- ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచి ముఖ్యమైన డెఫినేషన్స్, ఫార్ములాలు అండర్‌లైన్ చేసుకోవాలి. పైన పేర్కొన్న చాప్టర్ల ఆధారంగా ఈ కాన్సెప్టులను రోజూ పునశ్చరణ చేయాలి.
- రోజుకు రెండు చాప్టర్ల చొప్పున మాక్‌టెస్టులు రాయాలి. ఇవి గత జేఈఈ టెస్టుల నుంచి అయితే ఇంకా మంచిది. ప్రతీ పరీక్షలో మెరుగుదల ఉండాలంటే నెగెటివ్ మార్కులు తగ్గుతూ ఉండాలి. గెస్ వర్క్‌ను పూర్తిగా మానేయాలి.
- పరీక్షలో ప్రతీ సబ్జెక్టుకు గంట మాత్రమే సమయం కేటాయించాలి. మేథ్స్‌లో ప్రశ్నలు చాలా లెంథీగా ఉంటున్నాయి. అక్కడే సమయ పాలన చాలా అవసరం.

మేథ్స్:	
కాలిక్యులస్	35 శాతం,
ఆల్జీబ్రా	25 శాతం,
కోఆర్డినేట్ జామెట్రీ	20 శాతం,
వెక్టార్స్ 3డి	15 శాతం
ప్రాబబిలిటీ	5శాతం
ఫిజిక్స్:	
మెకానిక్స్	30 శాతం
ఎలక్ట్రోడైనమిక్స్	25 శాతం
ఆప్టిక్స్ అండ్ మోడ్రన్ ఫిజిక్స్	20 శాతం
థర్మోడైనమిక్స్	15 శాతం
వేవ్స్ అండ్ ఆస్లేషన్స్	10 శాతం
కెమిస్ట్రీ:	
ఫిజికల్ కెమిస్ట్రీ	35 శాతం
ఇన్‌ఆర్గానిక్ కెమిస్ట్రీ	30 శాతం
ఆర్గానిక్ కెమిస్ట్రీ(బయోమాలిక్యుల్స్)	35 శాతం

- టైమ్ మేనేజ్‌మెంట్ కోసం ప్రతీ ప్రశ్నకు నిర్దుష్టంగా రెండు నుంచి మూడు నిమిషాలు మాత్రమే కేటాయించుకోవాలి. కాలిక్యులేషన్స్‌లో ఎక్కువ సమయం వృథా చేయకూడదు.
- మీకు కాన్ఫిడెన్స్ ఉన్న చాప్టర్లపై ఎక్కువ శ్రద్ధ పెట్టండి. ప్రస్తుతం ఉన్న సమయం దృష్ట్యా మీరు వీక్‌గా ఉన్న చాప్టర్లను వాటి వెయిటేజీ ఆధారంగా వదిలిపెట్టడమే మంచిది.

చాప్టర్ల వారీగా ఎంసెట్ ప్రణాళిక

తెలంగాణలో ఎంసెట్‌కు ఇప్పుడు సరిగ్గా 40 రోజుల సమయం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపుగా రెండు నెలల సమయం ఉంది. కేవలం ఎంసెట్ మాత్రమే రాయాలనుకునే విద్యార్థులు అందుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. మొదటి రోజు నుంచి వెయిటేజీ ఆధారంగా చదవడం చేయాలి. జేఈఈ తరవాత ఎంసెట్ రాయాలనుకునే విద్యార్థులకు టీఎస్‌లో కేవలం 30 రోజులు, ఏపీలో 50 రోజుల సమయం మాత్రమే ఉంటుంది. వీరు రాపిడ్ షెడ్యూల్ సిద్ధం చేసుకోవాలి.

- జేఈఈ మెయిన్‌తో పోలిస్తే ఎంసెట్‌లో 25 నుంచి 30 శాతం ఎక్కువ సిలబస్ ఉంటుంది. ఈ చాప్టర్లను పూర్తిగా పునఃశ్చరణ చేయాల్సిందే.
- జేఈఈ మెయిన్, ఎంసెట్ పరీక్ష ఏదైనా కాన్సెప్టులను ఎన్‌సీఈఆర్‌టీ చాప్టర్ల నుంచే రివైజ్ చేయాలి.
- వెయిటేజీ ఆధారంగా ముఖ్యమైన చాప్టర్లను చదవండి.
- జేఈఈతో పోలిస్తే ఎంసెట్‌లో ఒక్కో ప్రశ్నకు కేటాయించిన సమయం తక్కువ. ఒక నిమిషంలో ఒక ప్రశ్నను పూరించాల్సి ఉంటుంది. కాబట్టి కాలిక్యులేషన్స్‌తో సమయం వృథా చేయవద్దు.
- ఎంసెట్‌లో నెగెటివ్ మార్కులు లేనందున, ఆప్షన్‌కు అనుగుణంగా గెస్ వర్క్ చేయవచ్చు.
- గత ముప్పై సంవత్సరాల నుంచి వచ్చిన ప్రశ్నపత్రాలను తప్పనిసరిగా రివైజ్ చేయండి. ఎంసెట్‌లో రిపీటెడ్‌గా ప్రశ్నలు వచ్చే అవకాశం ఎక్కువ.
- ప్రతీ రోజు మాక్‌టెస్ట్ రాయండి. జేఈఈతో పోలిస్తే ప్రశ్నలు ఎంసెట్‌లో సులువుగా ఉంటాయి. ఎక్కువ ప్రాక్టీసు చేస్తే నిర్ణీత సమయంలోనే నిర్దుష్ట సమయంలో పేపర్‌ను పూర్తి చేయవచ్చు.
- ఒక వేళ నిమిషంలో ఆ ప్రశ్న పూర్తి కావడం లేదు అనుకుంటే ఈ ప్రశ్నను వదిలేయండి. చివర్లో సమయం మిగిలితే వీటికి ఉపయోగించవచ్చు.
- అన్నింటికన్నా ముఖ్యం ఈ కొద్దికాలం సోషల్ మీడియాతో పాటు చదువు నుంచి దృష్టి మళ్లించే ఇతర విషయాలకు దూరంగా ఉండడం అవసరం.
- చదువుతోపాటు ఆరోగ్యంపై కూడా దృష్టిపెట్టాలి. పోషక ఆహారం, వ్యాయామం, సరైన అవసరం. అప్పుడే మెదడు చురుకుగా పనిచేస్తుంది.



డా.పవన్ కుమార్ కాసు
సంజీవనీ ఐఐటీ అకాడమి



పాలిసెట్ 2025

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు ఉద్దేశించి పాలిసెట్ 2025 నోటిఫికేషన్లు వెలువడ్డాయి.

తెలంగాణ సెట్

తెలంగాణలోని పాలిటెక్నిక్ సీట్ల భర్తీకి మే 13న నిర్వహించే ఎంట్రెన్స్‌కు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం అయింది. ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్యా కోర్సుల తరహాలోనే రాష్ట్రంలోని పాలిటెక్నిక్ సీట్లన్నీ స్థానిక విద్యార్థులకు కేటాయించనున్నారు. మొత్తం సీట్లన్నీ కన్వీనర్ సీట్లు మాత్రమే. 85 శాతం సీట్లు స్థానికులకు, 15 శాతం స్థానికేతరులకు కేటాయించారు. అంటే నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న ఏడేళ్లలో నాలుగేళ్లు తెలంగాణలో చదివితే స్థానికులుగా పరిగణిస్తారు. స్థానికేతర కోటా అంటే పదేళ్లపాటు తెలంగాణ రాష్ట్రంలో నివసించిన వారి పిల్లలు, తెలంగాణలో పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగుల పిల్లలకు కేటాయిస్తారు.

ఫీజు : ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు దరఖాస్తు ఫీజు రూ.250/-, ఇతరులకు రూ.500/-
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 19
(రూ.100/- ఆలస్య రుసుముతో ఏప్రిల్ 21, రూ.300/- ఆలస్య రుసుముతో ఏప్రిల్ 23 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
ప్రవేశ పరీక్ష: 2025 మే 13
ఫలితాలు : 2025 జూన్
వెబ్‌సైట్ : https://polycet.sbtet.telangana.gov.in/

ఏపీ సెట్

ఆంధ్రప్రదేశ్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం ఏపీ పాలిసెట్ 2025 నోటిఫికేషన్ వెలువడింది. పదో తరగతి అర్హత ఉన్న విద్యార్థినీ, విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పరీక్ష మాత్రం ఆఫ్‌లైన్ మోడ్‌లో జరుగుతుంది. ఇది పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ప్రశ్న పత్రం మొత్తం 120 మార్కులకు ఉంటుంది. రెండు గంటల్లో దీనికి సమాధానాలు గుర్తించాలి. లెక్కల్లో 50 ప్రశ్నలు, ఫిజిక్స్‌లో 40 ప్రశ్నలు, కెమిస్ట్రీలో 30 ప్రశ్నలు ఉంటాయి.

ఫీజు: ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.400/-
ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు రూ.100/-
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 15
ప్రవేశ పరీక్ష : 2025 ఏప్రిల్ 30
ఫలితాలు : 2025 మే 10(ఉజ్జాయింపు తేదీ)
వయస్సు : ఎలాంటి వయోపరిమితి లేదు.
వెబ్‌సైట్ : https://polycetap.nic.in/

SCHOLARSHIP ALERT

Alstom India Scholarship : Phase-III

Description: Alstom India is offering this scholarship with an aim to provide financial support to students across India to help them pursue their higher education and prevent them from dropping out.

Eligibility: Students studying in any year of ITI/Diploma, general graduation, or professional graduation in STEM courses for FY 2024-25 can apply. Applicants must have secured at least 60% marks in their previous academic year/semester. The annual family income of the applicants must be less than or equal to INR 6,00,000 from all sources. The scholarship is open to students studying in locations such as Coimbatore (Tamil Nadu), Madhepura (Bihar), Sri City (Andhra Pradesh), or Vadodara (Gujarat) at specified colleges.

Prizes & Rewards: Up to INR 75,000 (one-time)
Last Date to Apply: 04-05-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/AISDG8

South Asia Postgraduate Excellence Award



Description: South Asia Postgraduate Excellence Award, 2025 is offered by the University of Nottingham. It aims to assist high-achieving international students from South Asia by covering a portion of their full-time Master's tuition fees at the university.

Eligibility: Open to residents of specific South Asian countries including India. Applicants must be classed as an overseas student for fee purposes. They must hold an offer to pursue full-time Masterâ ™s program for the academic session 2025-26.

Prizes & Rewards: Up to Â£8,000 (approx. â,¹8,51,016) towards tuition fees.
Last Date to Apply : 14-05-2025
Application mode : Online applications only
Short Url: www.b4s.in/aj/SAPE1

SBIF Asha Scholarship Program

Description: The SBIF Asha Scholarship Program for Overseas Education Students, one of India's largest scholarship programs, is an initiative of the SBI Foundation under its education vertical - Integrated Learning Mission (ILM). This scholarship aims to provide financial assistance to meritorious students from low-income families across India, ensuring the continuity of their education.

Eligibility: Open to Indian students belonging to SC and ST categories pursuing a masterâ ™s or postgraduate course (any year) at a premier university or college outside India. They should have secured at least 75% marks or above in their previous academic year, with a gross annual family income of up to INR 6,00,000.


Prizes & Rewards: Up to INR 20,00,000 or 50% of course-related expenses (whichever is less)
Last Date to Apply: 31-03-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SBIFS12

buddy4study.com

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

శ్రీలంకలో పాట చిత్రీకరణ



విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'కింగ్‌డమ్'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో మే 30న విడుదల కానుంది. ఈ సినిమాలోని ఓ పాట చిత్రీకరణ కోసం విజయ్ దేవరకొండ శ్రీలంక వెళ్లారు. ఈ షెడ్యూల్ వారం రోజుల పాటు కొనసాగుతుంది. కాగా, విజయ్ దేవరకొండ ఎయిర్‌పోర్ట్ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

జపాన్‌లో దేవర

జూనియర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన పాన్ ఇండియా చిత్రం 'దేవర' ఘన విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. జపాన్‌లో ఈనెల 28న విడుదల చేస్తున్నారు. ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు అక్కడి ప్రేక్షకులతో కలసి 'దేవర' చూసేందుకు ఎన్టీఆర్ జపాన్ వెళ్లారు. భార్య ప్రణతితో కలసి



ఎయిర్‌పోర్టులో కనిపించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాగా, ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ చిత్రంలో, బాలీవుడ్ సినిమా 'వార్-2'లో నటిస్తున్నారు. 'వార్-2' ఆగస్టు 14న థియేటర్లలో విడుదలవుతోంది.



ఈ సినిమాలో నటించడం గౌరవంగా భావిస్తున్నా

- ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్

నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రాబిన్ హుడ్'. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై వై.రవిశంకర్, నవీన్ ఎర్నేని నిర్మించారు. ఈనెల 28న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్, ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నటించడం ఒక గౌరవంగా భావిస్తున్నా. నన్ను మీ కుటుంబ సభ్యుడిగా చూస్తున్నందుకు ఆనందంగా ఉంది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది' అని అన్నారు. హీరో నితిన్ మాట్లాడుతూ 'ఈ సినిమాపై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాను. శ్రీలీలతో నాకు ఇది రెండో చిత్రం. మా ఇద్దరికీ హిట్ పెయిర్ అనే పేరు వస్తుంది' అని అన్నారు. హీరోయిన్ శ్రీలీల మాట్లాడుతూ 'నేను అనుకోకుండా చేసిన ఈ సినిమా అనుకున్న దానికంటే చాలా అద్భుతంగా వచ్చింది' అని చెప్పారు. చిత్ర దర్శకుడు వెంకీ కుడుముల మాట్లాడుతూ 'డేవిడ్ వార్నర్ క్యారెక్టర్‌లో చాలా సర్‌ప్రైజ్ ఉంటుంది. మార్చి 28న మీ అందరినీ తప్పకుండా ఎంటర్‌టైన్ చేస్తాం' అని అన్నారు. నిర్మాత వై.రవి శంకర్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నవ్వులతోపాటు మంచి కథ కూడా ఉంటుంది. కమర్షియల్ ఎలిమెంట్స్ అన్నీ ఉన్నాయి. సినిమా సూపర్ డూపర్ హిట్ పక్కా' అని చెప్పారు. మరో నిర్మాత నవీన్ ఎర్నేని మాట్లాడుతూ 'ఇది పూర్తిగా కుటుంబ వినోదాత్మక చిత్రం. కుటుంబ సమేతంగా చూసి ఎంజాయ్ చేయవచ్చు' అని అన్నారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'మైత్రీ మూవీస్ నా సొంత సంస్థలాంటిది. దర్శకుడు సినిమాను అద్భుతంగా తెరకెక్కించాడు. నితిన్‌కు నెక్స్ట్ లెవెల్ విజయం ఇచ్చే చిత్రమిది. చాలా ప్రేమతో తీసిన ఈ చిత్రాన్ని ఆదరించండి' అని కోరారు. కేతిక శర్మ మాట్లాడుతూ 'అదిదా సర్‌ప్రైజు పాట నిజంగా అదిరిపోతుంది' అని అన్నారు.



ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) 8వ తెలుగు సంబరాలు ఈవెంట్‌కు సిద్ధమవుతోంది. జూలై 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఈ ఉత్సవాలు అమెరికాలోని టంపాలో జరగనున్నాయి. తాజాగా హైదరాబాద్‌లో నాట్స్ 8వ తెలుగు సంబరాలు కర్టెన్ రైజర్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు సంబరాలు కాన్ఫరెన్స్ కన్వీనర్, మాజీ చైర్మన్ శ్రీనివాస్ గుత్తికొండ, నాట్స్ చైర్మన్ ప్రశాంత్ పిన్నమనేని, నటీమణులు జయసుధ, ఆమని, దర్శకులు హరీశ్ శంకర్, మెహర్ రమేష్, సంగీత దర్శకుడు తమన్, గీత రచయితలు రామజోగయ్య శాస్త్రి, చంద్రబోస్, కళ్యాణ్ చక్రవర్తి తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

కీలక పాత్రలో శ్రీకాంత్



సాయి దుర్గా తేజ్, ఐశ్వర్య లక్ష్మీ జంటగా రోహిత్ కేపీ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సంబరాల యేటి గట్టు'. కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 25న తెలుగుతోపాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సినిమాలో శ్రీకాంత్ కీలక పాత్రను పోషిస్తున్నారు. శ్రీకాంత్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. చిందరవందర జుట్టు, బాగా పెరిగిన గెడ్డంతో నల్లని కోటు ధరించిన శ్రీకాంత్ లుక్ అదిరిపోయింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

సాయికుమార్‌కు అవార్డు



నటుడు సాయికుమార్ కుమరం భీం జాతీయ అవార్డును అందుకున్నారు. ఆదివారం ఆసిఫాబాద్‌లో భారత్ కల్చర్ అకాడమీ, ఆదివాసీ సాంస్కృతిక పరిషత్, ఓం సాయితేజ ఆర్ట్స్ ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశాయి. జ్ఞాపికతో పాటు 50వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో భారత్ కల్చర్ అకాడమీ చైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి పార్థసారధి, మాజీ మంత్రి, నటుడు బాబు మోహన్, ఆదిలాబాద్ ఎంపీ నగేష్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ (ఆంధ్రజ్యోతి)

సందేశాత్మక చిత్రం




అజయ్, ఇంద్రజ, సుమన్, జయసుధ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సీఎమ్ పెళ్లాం'. గడ్డం రమణ దర్శకత్వంలో బొల్లా రామకృష్ణ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా నుంచి ప్రమోషనల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లా రామకృష్ణ మాట్లాడుతూ "రాజకీయ నేపథ్యంతో కూడిన సందేశాత్మక చిత్రమిది" అని అన్నారు. "ప్రతీ ఒక్కరినీ ఆలోచింపజేసే చిత్రమిది" అని దర్శకుడు రమణ గెడ్డం చెప్పారు. "ఈ పాట చూశాక చాలా భావోద్వేగానికి లోనయ్యాను. ఈ సినిమాతో అందరికీ మంచి పేరు వస్తుంది" అని నటుడు అజయ్ అన్నారు.



భీమవరం పర్యటనలో కృష్ణభారతితో మాట్లాడుతున్న ప్రధాని మోదీ (ఫైల్)

గాంధేయవాది కృష్ణభారతి మృతి



కృష్ణభారతి సేవలు మరువలేం

స్వాతంత్ర్య పోరాట చరిత్రకు ఆనవాలు చెందిన కృష్ణభారతి. ఆ మృతి కలచివేసింది. ఆమె సేవలు మరువలేం. ఆమె కుటుంబం స్వాతంత్ర పోరాటంలో ఎన్నో త్యాగాలు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమానికి ఆనవాలుగా ఉన్న చిట్టచివరి మహిళగా ఆమె లేని లోటు తీర్చలేనిది.

బొలిశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్యే



ఆమె జీవితం స్ఫూర్తిదాయకం

కృష్ణభారతి గాంధేయవాదిగా అతి నిరాడంబరంగా జీవించారు. ఆమె జీవితం మాకు స్ఫూర్తిదాయకం. పేద విద్యార్థుల చదువుకు ఆమె ఎంతగానో తోడ్పాడ్డారు. ఆమె దాతృత్వ కార్యక్రమాలు తమకు ఎంతో స్ఫూర్తిని కలిగించాయి. మా మేనత్త మాకు ఎంతో గర్వకారణం.

భోగిరెడ్డి ఆదిలక్ష్మి



పసల కృష్ణభారతి (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంకు చెందిన గాంధేయవాది పసల కృష్ణభారతి (92) హైదరాబాద్‌లోని సోదరి నివాసం వద్ద అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆమె తండ్రి పసల కృష్ణమూర్తి, తల్లి అంజలక్ష్మి స్వాతంత్ర పోరాటంలో కీలకంగా వ్యవహరించారు. వారిని బ్రిటిష్ ప్రభుత్వం జైలుకు పంపడంతో కృష్ణభారతి కారాగాంలోనే జన్మించారు. కృష్ణభారతి మొదటి నుంచి గాంధేయ వాదిగానే జీవించారు. వివాహం కూడా చేసుకోకుండా గాంధేయ జీవితం గడిపారు. కృష్ణభారతిని 2022లో భీమవరంలో అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేకంగా ఆహ్వానించి పాదాభివందనం చేసి సత్కరించారు. ఆమె మృతితో తాడేపల్లిగూడెంలో విషాద చాయలు అలముకున్నాయి.



స్ఫూర్తిదాయక మహిళను కోల్పోయాం

కృష్ణభారతి మృతి విచారం కలిగించింది. స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో అంజలక్ష్మి, పసల కృష్ణమూర్తి దంపతులది ప్రత్యేక స్థానం. తల్లిదండ్రుల త్యాగాలు, పోరాట స్ఫూర్తితో కృష్ణ భారతి గాంధేయవాదిగా, సంఘ సేవకురాలిగా, జాతీయ ఉద్యమాలకు కట్టుబడి పనిచేశారు. ఆమె మృతితో స్వాతంత్ర్య ఉద్యమ కాలంనాటి ఒక స్ఫూర్తిదాయక మహిళను తాడేపల్లిగూడెం పట్టణం కోల్పోయింది.

డి.సోమసుందర్, ఐజేయూ జాతీయ కార్యదర్శి



కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మను సత్కరిస్తున్న బీజేపీ నేతలు, కార్యకర్తలు

సామాన్య కార్యకర్తకు బీజేపీ పట్టం

సన్మాన సభలో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

భీమవరం టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సామాన్య కార్యకర్తకు బీజేపీ పట్టం కట్టిందని, ఎంపీ టికెట్ ఇవ్వడంతో పాటు కేంద్రమంత్రిని చేసిందని కేంద్ర భారీ, ఉక్కు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షురాలు ఐనంపూడి శ్రీదేవి అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో వర్మను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ తనతోపాటు జిల్లాలోని ప్రతి బీజేపీ కార్యకర్త కేంద్ర మంత్రేనన్నారు. తన విజయానికి కష్టపడి పనిచేసి పార్టీ జెండా భుజాలపై మోసిన ప్రతి కార్యకర్త కోసం, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ క్రమశిక్షణ పట్టుదలతో 34 ఏళ్ల పార్టీలో సామాన్య కార్యకర్త భూపతిరాజు శ్రీనివాస వర్మ కేంద్ర మంత్రి కావడంతో ప్రతి కార్యకర్తకు దక్కిన గౌరవం అన్నారు. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న శ్రీనివాసవర్మను బీజేపీ నాయకులు అభినందించారు. అనంతరం శ్రీనివాస వర్మను ఘనంగా సత్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పూల మాలతో ముంచెత్తారు. మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి, బీజేపీ నరసాపురం పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్ రాజు, టీవీఎస్ వర్మ, నార్ని తాతాజీ, అల్లూరి సాయి దుర్గరాజు, కాగిత సురేంద్ర, ఈతకోట తాతాజీ, కలిదిండి వినోద్ వర్మ, పద్మావతి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాపులకు రిజర్వేషన్లు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కాపు ఐక్య వేదిక డిమాండ్

తణుకు రూరల్ మార్చి 23, (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో మరాఠాలకు మాదిరి మన రాష్ట్రంలో కాపులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఉత్తరాంధ్ర కాపు ఐక్యవేదిక చైర్మన్ పి.వెంకటరాయలు డిమాండ్ చేశారు. పైడిపర్రులోని కాపు కళ్యాణ మండపంలో ఆదివారం కాపు ఐక్య వేదిక, సోషల్ జస్టిస్ ఫోరం ఆధ్వర్యంలో కాపు ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ రావి శ్రీనివాసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాపు యువత ఉపాధికి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కాపు కార్పొరేషన్‌కు రూ.3 వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏ ఏడాదికి కేటాయించిన నిధులు ఆ ఏడాదిలోనే ఖర్చు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జె.నాగబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కాపుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కోరారు. సోషల్ జస్టిస్ ఫోరం అధ్యక్షుడు జంగాల సింగరయ్య యాదవ్ మాట్లాడుతూ బీసీలకు, ఈడబ్ల్యూఎస్ వారికి ఇబ్బంది లేకుండా కాపులకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలు, కాపుల ఐక్య వేదిక ద్వారానే రాజ్యాధికారం దక్కుతుందన్నారు. సమావేశంలో బీసీ ఐక్య వేదిక నాయకులు దానా గౌడ్, సూర్య సాగర్‌బాబు, కాపు ఐక్యవేదిక మహిళా నాయకురాలు వెంకటలక్ష్మి, కాకిలేటి సత్యవాణి, కొమ్మిరెడ్డి రమాదేవి, దూలం చిట్టిపాప, కాకిలేటి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ మహమ్మారి

భయం లేదు

శరీరానికి అవసరమైన పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యం. బలవర్ధక ఆహారం తీసుకోకుంటే వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. పీల్చే గాలి ద్వారా కూడా వ్యాధులు ప్రబలి ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడతాయి. వేగవంతంగా సోకే వ్యాధి టీబీ (ట్యూబర్ క్యులోసిస్ బ్యాక్టీరియా). గాలిలో ఉండే సూక్ష్మక్రిములను పీల్చుకోవడం వల్ల క్షయ వ్యాధి సోకుతుంది. దేశ వ్యాప్తంగా ప్రతిరోజు వెయ్యి మంది క్షయతో మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. 1962లో భారత ప్రభుత్వం క్షయ నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టింది. మార్చి 24న ప్రపంచ క్షయ నివారణ దినం నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

నేడు క్షయవ్యాధి నివారణ దినోత్సవం

- ప్రభుత్వాసుపత్రిలో టీబీ పరీక్షలు
- రోగులకు ఉచిత వైద్యం, మందులు
- నెలకు రూ.వెయ్యి ఆర్థిక సాయం
- పోషకాహారంతో వ్యాధికి చెక్
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికి ముప్పు
- ఉమ్మడి జిల్లాలో వ్యాధి తగ్గుముఖం

ఏలూరు క్రైం/భీమవరం క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గాలిలో బ్యాక్టీరియా ద్వారా క్షయ వ్యాధి సోకుతుంది. గతంలో పోలిస్తే ఉమ్మడి జిల్లాలో టీబీ తగ్గుముఖం పట్టిందని చెప్పవచ్చు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి ఈ వ్యాధి త్వరితగతిన సోకుతుందని, వ్యాధి ఉన్న వారు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పూర్తి ఆరోగ్యంగా జీవించగలరని వైద్యులు చెబుతున్నారు. పీహెచ్‌సీ, ప్రభుత్వాసుపత్రిలో క్షయ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ట్రూనాట్ మిషన్లు, సైటిబి టెస్ట్, సీబీనట్ వంటి నాలుగు విధానాల్లో వ్యాధిని స్పష్టంగా నిర్ధారిస్తున్నారు.

క్షయ వ్యాధి పూర్తిగా నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి టీబీ విముక్తి భారత్ పథకాన్ని చేపట్టింది. దాతల సహకారాన్ని కోరింది. టీబీ బాధితులకు దాతలు నేరుగా పౌష్టికాహారం అందించవచ్చు. రోగికి ఆరు నెలల పాటు ఆహారం అందించడానికి జిల్లా టీబీ కంట్రోల్ అధికారులు లేదా సిబ్బందిని సంప్రదించాలి.

నివారణ ఇలా..

సాధారణంగా టీబీ సోకిన వారు ఆరు నెలల పాటు మందులను వాడాలి. ఆరు నెలలకు కూడా టీబీ తగ్గకపోతే అదనంగా మూడు విధానాల్లో ఈ మందువాడే ప్రక్రియను చేపడతారు. హెచ్‌మోనో ఆరు నెలల నుంచి 9 నెలల వరకూ, ఎస్ఒబి 9 నెలల నుంచి 11 నెలలు, ఎఒఎల్ 18 నుంచి 24 నెలల పాటు మందులను వాడిస్తారు. క్షయ బాధితులకు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం నెలకు రూ. 500 చొప్పున ఆరు నెలల పాటు రూ.3 వేలు అందజేసే వారు. 2024 నవంబర్ నుంచి నెలకు రూ.వెయ్యి చొప్పున అందిస్తున్నారు.



క్షయ వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నాం

క్షయ వ్యాధి నివారణ కోసం పూర్తిస్థాయిలో ర్యాండమ్ సర్వే నిర్వహిస్తున్నాం. బాధితులు పూర్తిస్థాయిలో మందులు వాడేలా సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఎవరైనా క్షయ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాలు లేదా టీబీ నిర్ధారణ కేంద్రాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి. ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి మందులున్నాయి. భయపడాల్సిన అవసరం లేదు. పరిశుభ్రత పాటించాలి. వ్యాధి నిరోధక శక్తి తగ్గకుండా తగిన ఆహారం తీసుకోవాలి. వ్యాధి సోకిన వారు ఆరు నెలల పాటు మందులను వాడాలి. కుటుంబంలో ఒక క్షయ బాధితుడు ఉంటే మిగిలిన వారికి సోకకుండా ముందస్తు చర్యలు కూడా తీసుకుంటున్నాం.

డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, క్షయ నివారణాధికారి, ఏలూరు జిల్లా



క్షయ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ (ఫైల్)

క్షయ వ్యాధి లక్షణాలు

- రెండు వారాలు మించి దగ్గు ఎక్కువగా ఉండడం, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గితే క్షయ వ్యాధి పరీక్ష చేయించుకోవాలి.
- దగ్గినప్పుడు కళ్లెలో రక్తపు మరకలు కనిపిస్తాయి.
- ఈ వ్యాధి గోర్లు, తల వెంట్రుకలు మినహా ఎక్కడైనా రావచ్చు.
- ఎక్కువగా ఛాతీ భాగంలో ఈ వ్యాధి ఉంటుంది. కొంతమందికి బ్రెయిన్‌లో కూడా వస్తుంది.
- క్షయ బాధితుడితో ఎక్కువ సమయం గడిపితే వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి త్వరగా సోకుతుంది.
- ధూమపానం, మద్యపానం వంటి వ్యసనాలు ఉన్నవారికి, అలాగే హెచ్‌ఐవి పాజిటివ్‌నకు టీబీ తొందరగా సోకే ప్రమాదముంది.

ఏలూరు జిల్లాలో 11 యూనిట్లు

ఏలూరు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో క్షయ నివారణ కార్యాలయం ఉంది. జిల్లాలో 11 ట్రీట్‌మెంట్ యూనిట్లు ఏర్పాటు చేశారు. జిల్లాలో నిత్యం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో 30 నుంచి 35 మంది వరకూ పరీక్షలకు వస్తున్నారు. 2023లో 72 వేల మందిని పరీక్షించి 2942 మందికి, 2024లో 62,945 మందిని పరీక్షించి 2,752 మందికి టీబీ సోకినట్లు గుర్తించారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ 2675 మందికి పరీక్షించగా 555 మందికి టీబీ సోకినట్లు గుర్తించారు. నూజివీడు, లింగపాలెం, కుక్కునూరు, భీమడోలు మండలాల్లో ఎక్కువగా టీబీ కేసులు ఉన్నట్లు తేలింది. జిల్లాలో క్షయ వ్యాధి లేని పంచాయతీలుగా తీర్చిదిద్దడానికి 2023లో 21గ్రామ పంచాయతీలు, 2024లో 37 గ్రామ పంచాయతీలను గుర్తించారు. ప్రతి గ్రామ పంచాయతీలో కూడా క్షయ వ్యాధిని పూర్తిగా నివారించడానికి ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు.

పశ్చిమలో 8 సెంటర్లు

పశ్చిమ గోదావరి జిల్లాలోని 8 సెంటర్లలో టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో సుమారు 3,250 మంది క్షయ బాధితులు ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. 90 మంది వైద్యులు పలు సీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో క్షయ బాధితులకు వైద్యం అందిస్తున్నారు. క్షయ వ్యాధి సోకినవారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరీక్షలు చేయించుకుని మందులు వాడితే ఎటువంటి ఇబ్బందులు ఉండవని వైద్యులు చెబుతున్నారు. నిర్లక్ష్యం చేయడం వల్ల కుటుంబంలో వారికి కూడా వ్యాధి సోకి అవస్థలు పడక తప్పదు.

ఉచితంగా మందులు

భీమవరం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో క్షయ వ్యాధి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందిస్తున్నాం. నిత్యం సుమారు 50 మంది భీమవరం ప్రభుత్వాసుపత్రికి మందుల కోసం వస్తుంటారు. క్షయవ్యాధి ఉన్నట్లు అనుమానం కలిగితే వెంటనే పరీక్షలు చేయించుకుని మందులు వాడడం చాలా మంచిది. నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది.

డాక్టర్ మాధవీ కల్యాణి, భీమవరం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్





జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో నరికివేసిన భారీ వృక్షం

భారీ వృక్షం నరికేశారు

- జడ్పీ కార్యాలయ ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం నరికివేత
- అడ్డుకున్న హిందూ సంఘాల జేఏసీ
- అనుమతి లేదన్న సీఈవో

ఏలూరు సిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని పరిరక్షించండి అని అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. మరోవైపు అధికారులకు తెలియకుండానే పెద్ద పెద్ద వృక్షాలు నరికేస్తున్నారు. జడ్పీ కార్యాలయ ఆవరణలో భారీ మర్రి వృక్షాన్ని కూల్చివేయడానికి రంగం సిద్ధం చేశారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు ఈ భారీ వృక్షాన్ని తొలగింపు చేపట్టినట్లు తెలుస్తోంది. ఆదివారం కొందరు యంత్రాలతో భారీ వృక్షాన్ని నరికివేత మొదలుపెట్టారు. విషయం తెలుసుకున్న హిందూ సంఘాల జేఏసీ నాయకులు అక్కడికి చేరుకుని నరికివేత అడ్డుకున్నారు. అప్పటికే సగం చెట్టును నరికివేయడంతో హిందూ సంఘాల నాయకులు జడ్పీ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. పోలీసులకు సమాచారం అందించారు. జడ్పీ సీఈవో కె.భీమేశ్వర్ మాట్లాడుతూ చెట్టు నరికేందుకు ఎవరికీ అనుమతి ఇవ్వలేదని, పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

కేసు నమోదు

ఏలూరు క్రైం: జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో మర్రిచెట్టును కొంతమంది అపహరించుకుపోయారని త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. భారీ మర్రిచెట్టును ఆదివారం ఉదయం పెదవేగి మండలం కూచింపూడి గ్రామానికి చెందిన బుద్ధవరపు రాజు మరి కొంత మంది నరికి ట్రాక్టర్లపై పట్టుకువెళ్లిపోయారని జడ్పీ రెవెన్యూ అధికారి ఇరణ్యకుల హరికృష్ణ త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఐనంటూ మహిళా ఉద్యోగికి ఫోన్

ఏలూరు క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సచివాలయ గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శికి తాను సీఐనంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. ఆమె ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. చింతలపూడిలోని వెలంపేటనకు చెందిన జి రాజ్యలక్ష్మి బూరాయిగూడెం సచివాలయంలో జీఎంఎస్‌కేగా పనిచేస్తున్నారు. ఒక వ్యక్తి ఫోన్ చేసి తాను ఏలూరు సీఐ అని తన పేరు నాగరాజు అని చెప్పారు. బోయిగూడెంలోని మేడేపల్లి సుందరరావును తనతో మాట్లాడించాలని చెప్పాడు. ఆమెను బెదిరించడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫోన్ నెంబర్ ఏలూరుకు చెందిన గెడ్డం కిశోర్ అలియాస్ నాగరాజుగా గుర్తించారు. అతను బజాజ్ ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంటుగా పనిచేస్తున్నట్లుగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై వేధింపులకు పాల్పడిన మారు తండ్రి అరెస్ట్

ఏలూరు క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన మారు తండ్రిని మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు అరెస్టు చేశారు. ఏలూరుకు చెందిన మహిళకు రెండో భర్తగా వచ్చిన కాకినాడకు చెందిన పోతుల వంశీ మోహన్ కుమార్ ఆమె మొదటి భర్త కుమార్తెతో అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. తల్లి గమనించి ఏలూరు మహిళా పోలీసులకు ఈనెల 21న ఫిర్యాదు చేసింది. సీఐ ఎం సుబ్బారావు కేసు నమోదుచేసి ఈ కేసులో నిందితుడైన పోతుల వంశీమోహన్ కుమార్ అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు.

యువతిపై అత్యాచారం

- ఏడుగురిపై పోక్సో కేసు

ఏలూరు క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): యువతిని ప్రేమిస్తున్నానని నమ్మించి ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా శారీరక సంబంధం కొనసాగించాడు. అతడితో పాటు అతడి స్నేహితులు కూడా తమ వద్ద వీడియోలు ఉన్నాయని, తమతో వివాహేతర సంబంధం కొనసాగించకపోతే సోషల్ మీడియాలో పెడతామని బెదిరించారు. వారు కూడా ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. విషయం తెలిసి బాధితురాలి తల్లిదండ్రులు ప్రశ్నించడంతో వారిని కూడా బెదిరించారు. దీంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏడుగురిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఏలూరులోని ఓ ప్రాంతానికి చెందిన యువతి (18)ని జేపీ నగర్‌కు చెందిన ఆళ్ల వంశీకృష్ణ ప్రేమిస్తున్నానని నమ్మబలికాడు. ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా గత ఏడాది ఆగస్టులో ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. తర్వాత పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. అంతే కాకుండా అతని స్నేహితులైన యానాదుల సాయిచరణ్, చిట్లూరి శివశంకర్ కూడా ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. వీడియోలు ఉన్నాయని, ఫోటోలు ఉన్నాయని సోషల్ మీడియాలో పెడ తామని బెదిరించారు. ఈకేసుకు సంబంధించి వారితో పాటు రాయి విజయ్, రాయి పావని, యానాదుల సింహాద్రి, యానాదుల కార్తీక్‌పై కూడా పోక్సో కేసు నమోదుచేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పు తిరిగి చెల్లించినా బెదిరింపులు

- ఆరుగురిపై కేసు

ఏలూరు క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ కంపెనీలో అప్పు తీసుకుని తిరిగి చెల్లించినప్పటికీ బెదిరిస్తున్న ఆరుగురిపై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరు సమీపంలో దుగ్గిరాలకు చెందిన కె.గోవిందు ఏలూరు ఆర్ఆర్‌పేటలో ఉన్న బజాజ్ ఫైనాన్స్ ద్వారా రెండున్నర సంవత్సరాల క్రితం కొంత అప్పు తీసుకున్నారు. వాయిదాలు సక్రమంగానే కడుతూ వచ్చారు. యాక్సిడెంట్ జరగడంతో ఆయన ఏ పనిచేయలేక ఇంటి వద్దే ఉంటున్నారు. కంపెనీ వారు సొమ్ములు చెల్లించడం లేదని ఫోన్లు చేయించడంతో తనకు యాక్సిడెంట్ అయిందని చెప్పగా ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ ఇతర వివరాలు తమకు ఇవ్వాలని సూచించారు. దీంతో ఇన్సూరెన్సు క్లెయిమ్ అయిందని సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. రెండు రోజుల క్రితం వెంకట్ షేక్ ఇబ్రహీమ్ రియాజ్, ప్రవీణ్‌కుమార్, గడ్డం కిషోర్, మధ్యాహ్నపు వంశీ కృష్ణలు గోవిందును బెదిరించారు. గోవిందుకు అతని కుటుంబ సభ్యులకు సంబంధించిన ఫోటోలను మార్ఫింగ్ చేసి అసభ్యకరమైన ఫోటోలుగా మార్చి సోషల్ మీడియాలో పెడతామని బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులంతా రికవరీ ఏజెంట్లుగా పని చేస్తున్నట్లు తేలింది. వీరు గతంలో కూడా పోలీసులమంటూ బజాజ్ ఫైనాన్స్ కంపెనీకి బాకీలు ఉన్నవారిని బెదిరిస్తున్నట్లుగా కేసులు నమోదు అయి ఉన్నాయి.



భక్తులతో కిక్కిరిసిన క్యూలైన్

గుబ్బల మంగమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గుబ్బల మంగమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వందలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులుతీరారు. ఇటీవల అమ్మవారి జాతర ముగియడంతో ఆలయానికి భక్తుల రాక మరింత పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. అధికంగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం అమ్మవారి నామ స్మరణతో మారుమోగింది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.



పొగాకు బేళ్లు (ఫైల్)

నేటి నుంచి పొగాకు కొనుగోళ్లు

జంగారెడ్డిగూడెం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెండు పొగాకు వేలం కేంద్రాలలో కొనుగోళ్లు సోమవారం ప్రారంభం కానున్నాయి. పొగాకు బోర్డు చైర్మన్ వై.యశ్వంత్ కుమార్ కొనుగోళ్లు ప్రారంభిస్తారని ఆక్షన్ సూపరిండెంటెంట్ జె.సురేంద్రకుమార్ తెలిపారు. గత ఏడాది రికార్డు స్థాయిలో రూ.411 ధర లభించింది. ఈ ఏడాది రైతులకు ఖర్చులు అధికంగా అవడంతో మరింత అధిక ధర వస్తేనే గిట్టుబాటు అవుతుందని రైతులు ఎదురు చూస్తున్నారు. అధిక శాతం నాణ్యమైన పొగాకు దిగుబడితో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్కూటర్ డిక్కీలో ఉంచిన సొమ్ము రూ.5లక్షలు చోరీ

ఏలూరు క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులో డబ్బులను డ్రా చేసి స్కూటర్ డిక్కీలో ఉంచాడు. ఒక కల్యాణ మండపం వద్దకు వెళ్లి బయటకు వచ్చేటప్పటికి గుర్తు తెలియని వ్యక్తులు స్కూటర్ డిక్కీ పగులగొట్టి నగదును అపహరించుకుపోయారు. ఏలూరు కొత్తపేట పూడి అప్పలస్వామి వీధికి చెందిన కె.రవిశంకర్ శ్రీనివాస్ ఏలూరు మినీ బైపాస్ రోడ్డులో ఉన్న చలసాని గార్డెన్స్ కల్యాణ మండపం పార్టనర్. ఈనెల 21న సాయంత్రం అమీనాపేట బ్యాంక్ ఆఫ్ బరోడాలో రూ.5 లక్షలు డ్రా చేసుకుని స్కూటర్ డిక్కీలో ఉంచాడు. అక్కడ నుంచి మినీ బైపాస్ రోడ్డులోని చలసాని గార్డెన్స్ కల్యాణ మండపం వద్ద స్కూటర్ పెట్టి లోపలికి వెళ్లి కొంత సమయం తరువాత బయటకు వచ్చేటప్పటికి స్కూటర్ డిక్కీ పగులగొట్టి ఉంది. ఈ సంఘటనపై త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా

బుట్టాయగూడెం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 26న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.కుసుమ తెలిపారు. జాబ్‌మేళాలో వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని టెన్త్ నుంచి పి.జి. పూర్తి చేసిన 30ఏళ్లలోపు యువకులు అర్హులన్నారు. వివరాలకు 94925 82007, 96663 22032, 99888 53335 నెంబర్లను సంప్రదించాలని, అలాగే బయోడేటా, సర్టిఫికేట్స్ నకళ్లతో హాజరు కావాలన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

ఏలూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం మండల, డివిజనల్, మున్సిపల్, జిల్లా స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు డీఆర్వో వి.విశ్వేశ్వరరావు తెలిపారు. సీఎం చంద్రబాబు 27న పోలవరం పర్యటనకు వస్తున్న సందర్భంగా ఏర్పాట్ల పరిశీలనకు కలెక్టర్, జాయింట్ సోమవారం పోలవరం వెళ్లనున్నారని, జిల్లా కేంద్రంలో వారిద్దరూ అందుబాటులో ఉండరని, ఫిర్యాదుల స్వీకరణ యథావిధిగా జరుగుతుందని డీఆర్వో తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ పట్ల ఎంఆర్పీఎస్ హర్షం

ఏలూరు టూటౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పట్ల ఎంఆర్పీఎస్ హర్షం వ్యక్తం చేసింది. ఎంఆర్పీఎస్ కార్యాలయంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ జాతీయ నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి కాశీకృష్ణలు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ చేయడం పట్ల ఎస్సీలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఎస్సీలోని 59 ఉపకులాల్లో ఏ ఒక్కరికి అన్యాయం జరగదన్నారు. విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు వర్గీకరణ మేలు చేకూరుస్తుందన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి నిధులతో కవ్వగుంటలో బీటీ రోడ్డు

పెదవేగి, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : ఉపాధి నిధులు రూ.27 లక్షలతో కవ్వగుంట దళితవాడకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. పంచాయతీరాజ్ ఏఈ శాకమూడి మురళీకృష్ణ పనుల నిర్వహణను ఆదివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి నిధులతో ఈ రోడ్డు పనులు ప్రారంభించామని, తొలుత మెటల్, ఆపై తారు రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. దాదాపు 700మీటర్ల దూరం రోడ్డు పక్కాగా నిర్మిస్తున్నామని ఆయన చెప్పారు. విజయరాయి సొసైటీ మాజీ ఛైర్మన్ బొప్పన సుధాకర్, గ్రామ మాజీ సర్పంచ్ సుగసాని వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకుడు సుగసాని గంగాధరరావులు పనులను పర్యవేక్షించారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : రాట్నాలకుంటలోని శ్రీరాట్నాలమ్మకు ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకు లు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణశర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీష్ కుమార్ తెలిపారు.


రహదారి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం : పత్సమట్ల

ఉంగుటూరు/నిడమర్రు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. ఆదివారం ఉంగుటూరు ఎస్సీ బాలికల హాస్టల్ నుంచి నారాయణపురం వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నారాయణపురం నుంచి తల్లాపురం వరకు త్వరలో మట్టి రోడ్డును సీసీ రోడ్డుగా నిర్మిస్తామన్నారు. నిడమర్రు మండలం మందలపర్రు నుంచి క్రొవ్విడి గ్రామ శివారు వరకు ఉన్న చినకాపవరం కాలువ గట్టు రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, సర్పంచులు బండారు సింధు మధు, దిడ్ల అలకనంద, మాజీ ఎంపీపీ గోలి శ్రీనివాసరావు, మాజీ సర్పంచి అక్కిన నాగమణి, టీడీపీ మండలాధ్యక్షులు పాతూరి విజయకుమార్, ఉంగుటూరు ఉపసర్పంచి పాతూరి జగదీష్, జనసేన పార్టీ మండలాధ్యక్షులు పందిరాంబాబు, జనసేన నాయకులు పి.వాసురాజు, బేతు మురళీ పాల్గొన్నారు.

గ్రంథాలయ మనుగడకు పోరాటం : హరినాథరాజు

ఏలూరు రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ మనుగడ కోసం ఆయా ప్రభుత్వ శాఖలు తప్పనిసరిగా పన్ను చెల్లిస్తే గ్రంథాలయ సంస్థలు మనుగడ సాగిస్తాయని సామాజిక, ఆర్టీఐ కార్యకర్త హరినాథరాజు అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ మనుగడ కోసం తాను పోరాటం చేస్తున్నానన్నారు. స్థానిక సంస్థలో వసూలు చేస్తున్న గ్రంథాలయ పన్ను పైనే ఆధారపడి ఉన్నాయన్నారు. సకాలంలో పన్నులు చెల్లిస్తే గ్రంథాలయాలకు పూర్వవైభవంతోపాటు మౌలిక వసతులకు కొదవ ఉండదని హరినాథరాజు పేర్కొన్నారు.

బాల్య వివాహాల నిరోధంపై అవగాహన

ఏలూరు రూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : అమీనాపేటలోని ఎస్సీ, బీసీ, సోషల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్లో ఆదివారం చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలికలకు బాల్య వివాహాల నిరోధంపై అవగాహన కల్పించారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారి ఎన్.పుష్పలత మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాలికలు చిన్న వయస్సులో వివాహాలు చేసుకోవడం వలన అనేక నష్టాలు ఎదురవుతాయన్నారు. బాలల హక్కుల జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.రవిబాబు మాట్లాడుతూ చదువును నిర్లక్ష్యం చేయవద్దన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారి జి.రాధ, క్రాఫ్ కో-ఆర్డినేటర్ ఆర్.వినోద్ కుమార్, జి.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి : సీపీఐ

ఏలూరు కార్పొరేషన్, మార్చి23(ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, సీపీఐ ఏలూరు ఇన్‌చార్జి అక్కినేని వనజ పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా నరేంద్రమోదీ నిరంకుశ పాలనను నిరసిస్తూ రైతు ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ స్వాతంత్ర్య సమర యోధుడు భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని దేశ వ్యాప్త పిలుపులో భాగంగా సీపీఐ ఏలూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో జెండా ఊపి ప్రచార జాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఐ శ్రేణులు బండి వెంకటేశ్వరరావు, డేగా ప్రభాకర్, మన్నవ కృష్ణ చైతన్యల బృందం భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ అనుబంధ సంస్థల ప్రతినిధులు రెడ్డి శ్రీనివాస డాంగే, కుంచే వసంతరావు, వరక శ్యామల, మన్నవ యామిని, ఉప్పులూరి లక్ష్మి, కడుపు కన్నయ్య హాజరయ్యారు.

పోలవరంలో ప్రజా సమస్యలను పరిష్కరించాలి

పోలవరం, మార్చి23(ఆంధ్రజ్యోతి) : ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలతో పాటు 30 పడకల ఆసుపత్రి నిర్మించాలని, 1/70 భూములకు పట్టాలివ్వాలని, పోలవరానికి శ్మశాన వాటికను నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై జరుగుతున్న ప్రజా చైతన్య యాత్ర ఆదివారం పోలవరం చేరుకుంది. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కారం భాస్కర్, బొరగం భూచంద్రం, పోలోజు నాగేశ్వరరావు, చుండ్రు బుల్లెమ్మ, ఎస్ సాయికృష్ణ, గోకూరి పాండవులు, కె భీమరాజు, అనూష, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి ఉపాధి కల్పనపై రేపు సదస్సు

జంగారెడ్డిగూడెం, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సూర్య కిరణ్ కల్యాణ మండపంలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 25న ప్రధాన మంత్రి ఉపాధి కల్పనపై అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు పారిశ్రామికవేత్తలంతా తరలి రావాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యాం చంద్రశేష పిలుపునిచ్చారు. ఆదివారం సీహెచ్ఆర్ టౌన్ హాల్లో టీడీపీ మండలాధ్యక్షుడు సాయిల సత్యనారాయణ అధ్యక్షతన మండల కమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శేష మాట్లాడుతూ యువతీ, యువకులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కుక్కల మాధవరావు, మాజీ జడ్పీటీసీ శీలం రామచంద్రరావు, బూసా సత్యనారాయణ, ముళ్లపూడి శ్రీను, ఎస్.ఎస్.ఇస్మాయిల్ పాల్గొన్నారు.

బీరువాలోని బంగారు తాడు అపహరణ

జంగారెడ్డిగూడెం, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : చిన్నవారిగూడెం గ్రామానికి చెందిన ఏలేటి రాణి అనే మహిళ ఇంట్లో రూ.లక్షా 60వేల విలువైన బంగారు వస్తువులు అపహరణకు గురయ్యాయని బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్.ఐ. ఎస్.కె.జబీర్ తెలిపారు. మండలంలోని చిన్నవారిగూడెం గ్రామానికి చెందిన ఏలేటి రాణి అదే గ్రామంలో ఆశా వర్కర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 18న ఉదయం బాత్‌రూమ్‌కి స్నానానికి వెళ్లి తిరిగి వచ్చే సరికే ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బీరువాలోని నాలుగు కాసుల బంగారు తాడు అపహరించుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్.ఐ. తెలిపారు.

హైవే పెట్రోలింగ్ వాహనాలకు జీపీఆర్ఎస్

ఏలూరు క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహించే వాహనాలకు పోలీస్ సిబ్బంది విధులను అప్రమత్తంగా నిర్వహించాలని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ అన్నారు. జాతీయ రహదారులపై పెట్రోలింగ్ నిర్వహించే ఎనిమిది వాహనాలకు జీపీఆర్ఎస్‌ను ఆదివారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద అమర్చారు. ఈసందర్భంగా డీఎస్పీ ఆ మొబైల్ సిబ్బందితో మాట్లాడుతూ రహదారి భద్రతను మెరుగుపర్చేందుకు కీలక చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. జీపీఆర్ఎస్ విధానం వల్ల భద్రత మరింత మెరుగుపడుతుందన్నారు. మద్యం మత్తులో వాహనాలను నడిపే వారిని జాతీయ రహదారిపై హైవే సిబ్బంది గుర్తించాలన్నారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించే వారికి కౌన్సెలింగ్ నిర్వహించి ప్రమాదాలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా హైవే మొబైల్ సిబ్బందికి రేడియం జాకెట్లను అందజేశారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో హైవేపై ప్రమాదాలు జరిగితే పోలీస్ కంట్రోల్ రూమ్ (83329 59175)కు గాని 112కు గాని సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.


సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ శ్రావణ్ కుమార్


వేలేరుపాడులో యువత ర్యాలీ


జంగారెడ్డిగూడెంలో నివాళులు


కృష్ణాపురం గ్రామంలో నివాళుల దృశ్యం

పోరాటంలో భగత్ సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

ఏలూరు అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : సత్రంపాడు బీసీ బాలుర వసతి గృహంలో భగత్ సింగ్ వర్ధంతిని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కె.నాని ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి హాస్టల్ వార్డెన్ హరినారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమస్యలపై పోరాడటానికి భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయ కులు యశ్వంత్, హర్ష, తదితరులు పాల్గొన్నారు.

● టి.నర్సాపురం : కృష్ణాపురం గ్రామంలో బంజార భజరంగభేరి సంఘం ఆధ్వర్యంలో భగత్ సింగ్, సుఖదేవ్, రాజగురువుల వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సీపీఎం నాయకులు అనుమోలు మురళీ, జరబల రమేష్, భూక్యా రాములు, కృష్ణా, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి : భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘ నాయకులు టి.బాబు, ఎం.వసంతరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో చిన్న వయస్సులోనే ప్రాణాలర్పించిన వ్యక్తి భగత్‌సింగ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో టి.రాజు, వి.రామారావు, చందు, అంబేద్కర్, పలువురు పాల్గొన్నారు.

● భీమడోలు : ఎస్సీ బాలుర వసతి గృహంలో భగత్ సింగ్ వర్ధంతి సీఐటీయూ నాయకుడు లింగరాజు, వసతి గృహం నిర్వాహకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు భగత్ సింగ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు భగత్ సింగ్ త్యాగాన్ని వివరించారు.

● కుక్కునూరు : స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్ తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని సీపీఐ మండల సమితి కార్యదర్శి ఎం.వెంకటాచారి పేర్కొన్నారు. ఆదివారం కుక్కునూరు, సీతారామనగరం గ్రామాల్లో భగత్ సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మడిపల్లి రమణయ్య, నగిరికంటి నాగరాజు, దేవ, గంగా, దావీదు పాల్గొన్నారు.

● కామవరపుకోట : స్థానిక శాఖా గ్రంథాలయంలో భగత్‌సింగ్ వర్ధంతిని సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్. రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శాఖా గ్రంథాలయం వద్ద గ్రంథాలయ అధికారి ఎం.భీమరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

● పోలవరం: జిల్లేళ్లగూడెం పంచాయతీ రెడ్డినాగంపాలెంలో నవయువ సమాఖ్య, పిడిఎస్‌వో ఆధ్వర్యంలో విప్లవ వీరుల వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవయువ సమాఖ్య మండల నాయకులు చెదల శివ, మిడియం శ్రీను పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం :భగత్‌సింగ్ స్ఫూర్తితో అన్యాయాలు, అక్రమాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఐ మండల కార్యదర్శి జంపన వెంకట రమణ రాజు పిలుపునిచ్చారు. ఆదివారం భగత్ సింగ్ వర్ధంతిని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుంచె వసంతరావు, శ్రీను, జగన్నాథ కృష్ణ పాల్గొని భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● బుట్టాయగూడెం : భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల వర్ధంతిని పురస్కరించుకుని బుట్టాయగూడెంలో పీవైఎల్, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు కెచ్చెల పోతురెడ్డి, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాస్, న్యూడెమోక్రసీ నాయకుడు కారం రాఘవ, పీవైఎల్ నాయకులు జి.ప్రసాద్ రెడ్డి, టి.బాబూరావు, నడపాల ముక్కారెడ్డి, బి.వినోద్, పౌర హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాషా శ్యాంబాబు, కె.నడిపిరాజు, జి.బాబూరావు, పి.రాముడు, ఎం.మురళి, కె.నాగార్జున, చంద్రం, రాజేష్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.


ఎమ్మెల్యేకు సన్మానం చేస్తున్న నాయకులు

ఎమ్మెల్యే రోషన్‌కు సన్మానం

లింగపాలెం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములవ్వాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌కు లింగపాలెం మండల దళితనాయకులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ అభివృద్ధిలో నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానని ప్రజలంతా ప్రజలంతా భాగస్వాములవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు జి.చలపతిరావు, దళిత నాయకులు పల్లి శ్రీను, తాడేపల్లి దాసు, కొత్తూరు నాగమణి, పొదిల శౌరి, సంగీత, అజయ్ పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంటి

రామ్ చరణ్ అభిమానుల రక్తదానం

ఏలూరు టూటౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మెగా కుటుంబానికి సేవాతత్వం ఉందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. రామ్‌చరణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ మేరకు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే చంటి ప్రారంభించారు.రామ్‌చరణ్ పుట్టిన రోజును పురస్కరించుకుని కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ మెగస్టార్ చిరంజీవి స్ఫూర్తితో మెగా అభిమానులు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంఆర్ పెదబాబు, కొట్టు మనోజ్, మారం హనుమంతరావు, త్రిపర్ణ రాజేశ్, ఎన్.కాశీ నరేశ్ పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన

ఏలూరు కార్పొరేషన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : ఆదివారపుపేటలోని షిర్డీసాయి ప్రేమమందిర్ ఆరవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆలయ అధ్యక్షులు ఇసుకపల్లి తాతారావు ఆధ్వర్యంలో అన్న సమారాధనను ఎమ్మెల్యే బడేటి చంటి దంపతులు, నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబులు ప్రారంభించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

లయన్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు రూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. క్రాంతి కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన సమావేశంలో జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు అధ్యక్షతన నూతన కార్యవర్గం ఎన్నికైంది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ ఇంటర్నేషనల్‌కు 90వేల డాలర్లకు పైగా విరాళాలు అందించామని, ఆంధ్ర ప్రదేశ్‌లోనే ఇది అత్యధికమన్నారు. ముఖ్య అతిథిగా వచ్చిన లయన్స్ ఇంటర్నేషనల్ తృతీయ వైస్ ప్రెసిడెంట్ వేగేశ్న విజయకుమార్ రాజు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా లయన్స్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. మల్టీపుల్ చైర్ పర్సన్ శ్రీశాంతి మాట్లాడుతూ 2025 సంవత్సరానికి ఎన్నికలు జరిగాయన్నారు. గవర్నర్‌గా ఎన్.వి.వి.ఎస్.పాపారావునాయుడు, ప్రథమ వైస్ గవర్నర్‌గా డాక్టర్ డి.సుబ్బారావు, తృతీయ వైస్ గవర్నర్‌గా ఆర్.వి.ఎస్. సూర్యనారాయణ రాజు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎం.శ్రీరామ్, వి.కోటేశ్వరరావు, వి.కె.పంకజాక్షన్, ఎల్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహిళపై దాడి

జంగారెడ్డిగూడెం, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : డ్రైనేజీలో డైపర్లు వేయవద్దన్నందుకు ఆగ్రహం వ్యక్తం చేస్తూ జుత్తుక గంగారత్నం అనే మహిళపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. మైసన్నగూడెం గ్రామానికి చెందిన జుత్తుక గంగారత్నానికి అదే గ్రామానికి చెందిన జుత్తుక రమణకు డ్రైనేజీ విషయంలో ఘర్షణ జరిగింది. జుత్తుక రమణతో పాటు మరో ముగ్గురు కలిసి గంగారత్నంపై దాడి చేశారు. ఇంటివద్ద ఉన్న సీసీ కెమేరాలను కూడా కర్రలతో పగలగొట్టారు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

ఇంటర్వ్యూ..

తాగునీటి ఎద్దడి రానివ్వం

టి.నిఖిల్ మధుసూదన్, ఎంపీడీవో, జీలుగుమిల్లి



● **తాగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలేంటి?**
జవాబు : వేసవిలో తాగునీటి సమస్య రాకుండా క్రాస్ ప్రోగ్రాం ద్వారా చేతి పంపులు రిపేరు చేయించాం. క్లోరినేషన్, ట్యాంక్ క్లినింగ్‌లు జరుగుతున్నాయి.

● **పారిశుధ్యంపై పర్యవేక్షణ ఎలా ఉంది?**
జవాబు : స్వచ్ఛాంధ్రలో భాగంగా గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాం. ఇళ్ల నుంచి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తున్నాం.

● **ఇంటి పన్నుల వసూళ్లకు చేపట్టిన చర్యలేంటి?**
జవాబు : ఈ ఆర్థిక సంవత్సరంలో నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని కార్యదర్శులకు తెలిపాం. ఇప్పటికి వరకు పంచాయతీల్లో 70శాతం వసూలు చేశాం.

● **ఉపాధి పనుల పరిస్థితి ఏమిటి?**
జవాబు : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రోడ్ల నిర్మాణం చేపట్టాం.

● **ప్రజలకు అందిస్తున్న సేవలేంటి?**
జవాబు : గ్రామీణ ప్రజల సాధికారతలో భాగంగా ప్రభుత్వం డ్రోన్ సర్వే నిర్వహించి యాజమాన్య ఆస్తి ధ్రువపత్రం ఇస్తోంది. వంకవారిగూడెం పంచాయతీని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశాం. సర్వే జరుగుతోంది.

- జీలుగుమిల్లి, ఆంధ్రజ్యోతి

గ్రంథాలయంతో విజ్ఞానం

పెదవేగి, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని పొందవచ్చని పెదవేగి శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు తోట అరుణ్ కుమార్ అన్నారు. పెదవేగిలో శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం చేపట్టి గ్రంథపఠనంతో కలిగే లాభాలను వివరించారు.

పశువుల ఎరువు వేలం

చింతలపూడి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలోని జంగారెడ్డిగూడెం సబ్ యార్డులో ప్రతి శుక్రవారం పశువుల సంత జరుగుతుంది. ఈ సంతలో పశువుల పెంటకు 2025-26 సంవత్సరానికి ఈనెల 25న వేలం జరు గుతుందని మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎస్.కె.మెహరాజ్ పాషా తెలిపారు. పశువుల సంత శుక్రవారం జరుగుతుందని, మరుసటి రోజు పశువుల పెంట పోగు చేసుకోవాలని, ఈ వేలంలో పాల్గొనే వారు గంట ముందు 2 వేల 500 చెల్లించి పాల్గొనాలని తెలిపారు.

పది లీటర్ల సారా స్వాధీనం

చింతలపూడి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : నాగిరెడ్డిగూడెం వెళ్లే మార్గంలో మొక్కజొన్న ఫ్యాక్టరీ వద్ద ఎక్సైజ్ అధికారులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పది లీటర్ల సారాను పట్టుకున్నారు.చాట్రాయి మండలం కొత్త గూడేనికి చెందిన ఇరువురు మోటారు సైకిల్‌పై పది లీటర్ల సారా తరలిస్తుండగా పట్టుకున్నట్టు తెలిపారు. సారాతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని ముల్లంగి శ్రీనివాసరావు, రామేశ్వరం అనే ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

లింగపాలెం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పుప్పాలవారిగూడెంలో పేకాట స్థావరంపై దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఏఎస్ఐ రాంబాబు తెలిపారు. పుప్పాలవారిగూడెంలో పేకాడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి 3800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ

పోలవరం, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : పైడిపాక చంద్రన్న కాలనీలో సమరసత సేవక్ మూలెం వెంకన్నబాబు ప్రోద్బలంతో పైడిపాక విద్యార్థిని కర్రి శ్రీలక్ష్మి గ్రామంలో విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో భగవద్గీత పారాయణ చేయించారు. ఈ కార్యక్రమంలో గునపర్తి చంద్రావతి, మిరియాల నాగమణి, గునపర్తి హేమలతాదేవి, కర్రి వీరలక్ష్మి పాల్గొన్నారు.

బస్సు కండెక్టర్‌పై దాడి

జంగారెడ్డిగూడెం, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : సరిపడా చిల్లర ఇమ్మన్నందుకు ఆర్టీసి బస్ కండక్టరుపై దాడి చేసిన ప్రయాణికుడిపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సి ఎన్.ఉమామహేశ్వరరావు తెలిపారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ బస్టాండు నుంచి తాడేపల్లిగూడెం వెళ్లే బస్సు సర్వీసులో జల్లి ప్రవీణ్ కుమార్‌ను టికెట్‌కు సరిపడా చిల్లర అడిగినందుకు కండక్టర్ కోన ప్రసాద్‌పై దాడి చేశాడు. కండక్టర్ ఫిర్యాదు మేరకు జల్లి ప్రవీణ్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

తల్లిపాల స్టోరేజీ కేంద్రాల ఏర్పాటు

ఏలూరురూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : మెడికల్ కళాశాలల్లో తల్లిపాల స్టోరేజీ కేంద్రాల ఏర్పాటుతో పాటు పది వేల మంది గర్భిణులకు ఉచితంగా సర్వైకల్ కేన్సర్ టీకాలు వేయనున్నట్టు రోటరీ జిల్లా గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు వెల్లడించారు. రోటరీ క్లబ్ 3020 ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరు వైఎంహెచ్ఏ ప్రాంగణంలో క్లబ్ సమావేశం జరిగింది. గవర్నర్ అఫీషియల్ విజిట్ కార్యక్రమంలో భాగంగా స్థానిక సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ సెంటర్‌లో రోటరీ పీస్ టవర్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాజాగా రోటరీ 3020 ద్వారా తల్లిపాల స్టోరేజి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే గర్భిణులకు సర్వైకల్ కేన్సర్ వ్యాధి సోకకుండా పది వేల మందికి ఉచితంగా వ్యాక్సిన్‌లు అందజేస్తున్నట్టు తెలిపారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ సేవలు మరింత విస్తృతం చేయనున్నట్టు తెలిపారు. అన్నార్తులకు, దివ్యాంగులకు ఆహారం అందచేయనున్నట్టు తెలిపారు. సామాజిక సేవలో రోటరీ క్లబ్ ముందంజలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్.జి.వి. స్వామి, సెక్రటరీ భోగరాజు ప్రసాద్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ దాకారపు కృష్ణ, కల్యాణ్‌రాజు, డాక్టర్ పి.దామోదర్ రెడ్డి, డాక్టర్ లలిత, సంఘ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న క్లబ్ గవర్నర్ వెంకటేశ్వరరావు

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా : రాజేశ్

ఏలూరు రూరల్, మార్చి23(ఆంధ్రజ్యోతి) : ఆర్య వైశ్యులకు అండగా ఉంటానని ఆంధ్రప్రదేశ్ ఆర్య వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డి.రాజేశ్ అన్నారు. ఆదివారం ఆదిత్య ప్రిన్స్ హోటల్లో వాసవీ జాగృతి ఇంటర్నేషనల్, వాసవీ జాగృతి జయభేరి ఐకాన్ 2025 ఉత్సాహంగా నిర్వహించారు. ఇంటర్నేషనల్ ఫౌండర్ అధ్యక్షుడు తిరివీధి వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆర్యవైశ్యులను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం రాకతో తమ కష్టాలు తీరతాయన్నారు. ఫౌండర్ అధ్యక్షుడు తిరువీధి వేణుగోపాల్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులంటే త్యాగానికి, ధర్మానికి పెట్టింది పేరని, ఆర్యవైశ్యుల గౌరవ నినాదంతో వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారి సంక్షేమం, అభివృద్ధికి సరికొత్త ఆలోచనలతో వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ సంస్థను స్థాపించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.మురళీ మోహనరావు, నాదెళ్ల శ్రీనివాసులు, సుంకు చంద్రశేఖర్ గుప్త, జూలూరి కాశీ విశ్వనాథం, సంస్థ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ ఛైర్మన్‌ను ఘనంగా సత్కరించారు.


ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ రాజేశ్‌ను సత్కరిస్తున్న వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ సభ్యులు

30 నుంచి పాటిమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలు


బోనాలు సమర్పిస్తున్న దేవస్థానం ఛైర్మన్ దంపతులు

దెందులూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : పాటిమ్మ పేరంటలమ్మ ఉత్సవాలను ఈ నెల 30 నుంచి 4వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు దేవస్థానం ఛైర్మన్ యలమర్తి శ్రీనువాస్, మాజీ సర్పంచ్ యలమర్తి హేమలత అన్నారు. చల్లచింతలపూడి, తిమ్మనగూడెం గ్రామాల మధ్య వెలసిన అమ్మవారికి పుట్టింటి గ్రామమైన పెరుగుగూడెం నుంచి దేవస్థానం ఛైర్మన్ దంపతులు బోనాలు, నైవిద్యం సమర్పించి ఉత్సవాల పనులను ప్రారంభించారు.పెరుగుగూడెం గ్రామం నుంచి బ్యాండు సన్నాయిలతో మంగళవాయిద్యాలతో 31న ఊరేగింపుగా కలశాలతో వచ్చి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేస్తామన్నారు. ఉత్సవాల ఆఖరి రోజున భారీ నిప్పుల గుండం నిర్వహిస్తామని, అనంతరం 4వ తేదీన భారీ అన్నదానం ఉంటుందని దేవస్థానం ఛైర్మన్ దంపతులు శ్రీనివాస్, హేమలత దంపతులు తెలిపారు.

ఉల్లాస్ పరీక్షకు 11,171మంది హాజరు

ఏలూరు అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : నవ భారత సాక్షరతా కార్యక్రమం కింద ఆదివారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని స్వయం సహాయక సంఘా (ఎస్‌హెచ్‌జి)ల్లోని అభ్యాసకుల (నిరక్షరాస్యులు)కు 'ఉల్లాస్' పేరిట మొదటివిడత పరీక్షను నిర్వహించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఎస్‌హెచ్‌జిల్లోని 15 సంవత్సరాల వయస్సుపైబడిన బాలికలు, యువతులు, మహిళలకు డిజిటల్ లిటరసీ, ఫంక్షనల్ లిటరసీ, ఫైనాన్షియల్ లిటరసీల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి ఆదివారం పరీక్ష నిర్వహించారు. పరీక్ష రాసినవారి వివరాలను ఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(ఎన్ఐఓఎస్)కు పంపించామని, వీరందరికీ రెండు నెలల్లోగా సర్టిఫికెట్లు అక్కడినుంచే వస్తాయని జిల్లా వయోజన విద్యాశాఖ ఇన్‌చార్జి డీడీ జీ.సీహెచ్. ప్రభాకర్ తెలిపారు. రెండోవిడత సాక్షరతా కార్యక్రమం, శిక్షణను ఏప్రిల్‌నుంచి సెప్టెంబరువరకు నిర్వహించి పరీక్ష పెడతామన్నారు.

పురిటి గడ్డపై పులకింత...

పోలవరం, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురైన సొంత గ్రామాన్ని నిర్వాసితులు ఆదివారం సందర్శించి ఆనందం వ్యక్తం చేశారు. గతంలో తమ గ్రామాన్ని సందర్శించుకునే అవకాశం ఇవ్వాలంటూ వేడుకోగా ప్రాజెక్టు అధికారులు, భద్రతా బలగాలు నిర్వాసితులకు అనుమతినివ్వలేదు. ఎన్నిసార్లు ప్రయత్నం చేసినా ఉపయోగం లేకుండాపోయింది. ఐటీడీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ విషయం తెలుసుకుని వీరిని ముంపు గ్రామాలకు తీసుకెళ్లి వారి కోరికను నెరవేర్చింది. ఈ మేరకు పోలవరం ముంపులో భాగంగా ఖాళీ చేసిన సొంత గ్రామాన్ని దర్శించుకునే అవకాశం కల్పించిన ఐటీడీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గంగు అనీల్ కుమార్‌కి నిర్వాసితులు కృతజ్ఞతలు తెలిపారు. నిర్వాసితుడు కొత్తపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఒకప్పటి తమ గ్రామాన్ని చూసుకునే భాగ్యం కలగడం అదృష్టమన్నారు. ఐటీడీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రత్యేకంగా బోటులో తీసుకెళ్లి గ్రామాన్ని చూపించిందని నిర్వాసితుడు ఆనందం వ్యక్తం చేశారు.


తమ గ్రామాన్ని చూసుకుంటున్న నిర్వాసితులు

మానవత సాయం

మండవల్లి మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండవల్లి గ్రామంలో చెన్ను వెంకటేశ్వరరావు కుమారుడు వెంకటేష్‌కు రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లల్లో రాడ్లు వెయ్యడం వల్ల ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మండవల్లి మండల మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ గుడివాడ గణేశ్, కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ డాక్టర్ సుధాబత్తుల విజయకుమార్, ముళ్లపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో రూ.5వేలు పైకాన్ని వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు.

బంగారం ఇస్తామని మోసం

కలిదిండి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కలిదిండి మండలం పడమటిపాలెం గ్రామానికి చెందిన వ్యక్తికి విజయవాడకు చెందిన ఇద్దరు బంగారం వ్యాపారస్తులు తక్కువ ధరకు మేలిమి బంగారం ఇస్తామని సుమారు రూ.3.8 కోట్లు తీసుకున్నారు. నెలలు గడుస్తున్నప్పటికీ బంగారం ఇవ్వకపోవటంతో తాను మోసపోయానని గ్రహించి బాధితుడు కలిదిండి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదానానికి రూ.50 వేల విరాళం



ముదినేపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిత్య అన్నదాన కార్యక్రమానికి కృష్ణా జిల్లా బంటుమిల్లికి చెందిన యడ్లపల్లి నాగేశ్వరరావు, కమల దంపతులు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఆదివారం ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం దాతలు తమ విరాళాన్ని అందజేశారు.

ఇళ్లపై హైటెన్షన్ విద్యుత్ వైర్లు

బిక్కుబిక్కుమంటున్న కాలనీవాసులు.. ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపణ

ప్రాణనష్టం జరిగితేగాని అధికారులు పట్టించుకోరా అని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. తమ ఇళ్లను ఆనుకొని హైటెన్షన్ విద్యుత్ వైర్లు వెళుతున్నా పట్టించుకోవడం లేదని, పలుమార్లు విద్యుత్ తీగలు తెగిపడ్డాయని, అదృష్టవశాత్తు ప్రాణాపాయం తప్పిందని ముసునూరు ఎస్సీ కాలనీవాసులు తెలిపారు.





దళిత కాలనీలో ఇళ్లపై నుంచి వెళుతున్న విద్యుత్ వైర్లు

ముసునూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ముసునూరు ఎస్సీ కాలనీలో ఇళ్లపై ప్రమాదకరంగా 11కేవీ విద్యుత్ తీగలు ఉండటంతో కాలనీవాసులు బిక్కుబిక్కుమంటున్నారు. మూడేళ్ల నుంచి ఈ విద్యుత్ లైన్ తొలగించాలని ప్రజాప్రతినిధులు, ట్రాన్స్‌కో అధికారులకు వినతి పత్రాలు ఇస్తున్నా, స్పందన లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కాలనీలో సూమారు 40ఇళ్లకు ఆనుకుని విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షాకాలంలో ఇవి పలుమార్లు తెగిపడ్డాయని, ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని కాలనీవాసులు చెబుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు మాత్రం నగదు చెల్లిస్తేనే లైన్ తొలగిస్తామని చెబుతున్నారని, కూలి చేసుకుంటూ జీవనం సాగించే దళితులమైన తాము లక్షల్లో నగదు చెల్లించలేమని బాధిత కాలనీవాసులు వాపోయారు.

నిప్పురవ్వలు రాలుతున్నాయి



మా ఇంటి నడి కప్పుపైన 11కేవీ విద్యుత్ తీగలు ఆనుకుని ఉన్నాయి. ఈదురు గాలులకు ఈ తీగల నుంచి నిప్పురవ్వలు రాలుతున్నాయి. తీగలు తెగి పడితే ఇంటిల్లిపాది షాక్‌కు గురికావాల్సిందే. వీటిని తొలిగించాలి

- మద్దాల యోహాను, ఎస్సీ కాలనీ వాసి

సొమ్ము చెల్లిస్తేనే తొలిగింపు



ప్రభుత్వ నిబంధనల ప్రకారం 11కేవీ విద్యుత్ లైన్ తొలిగించాలంటే ఎస్టిమేట్ ప్రకారం బాధితులు నగదు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియకు బాధితులు ముందుకు వస్తే లైన్ తొలగింపుకు చర్యలు తీసుకుంటాం.

- ఎం. వీరబాబు, ట్రాన్స్‌కో ఏఈ



భీమవరం పర్యటనలో కృష్ణభారతితో మాట్లాడుతున్న ప్రధాని మోదీ (ఫైల్)

గాంధేయవాది కృష్ణభారతి మృతి





పసల కృష్ణభారతి (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 23 (ఆంధ్ర జ్యోతి): తాడేపల్లిగూడెంకు చెందిన గాంధేయవాది పసల కృష్ణభారతి(92) హైదరాబాద్‌లోని సోదరి నివాసం వద్ద అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆమె తండ్రి పసల కృష్ణమూర్తి, తల్లి అంజలక్ష్మి స్వాతంత్ర పోరాట సమయంలో కీలకంగా వ్యవహరించారు. వారిని బ్రిటిష్ ప్రభుత్వం జైలుకు పంపడంతో కృష్ణ భారతి కారాగాంలోనే జన్మించారు. కృష్ణ భారతి మొదటి నుంచి గాంధేయవాదిగానే జీవించారు. వివాహం కూడా చేసుకోకుండా గాంధేయ జీవితం గడిపారు. కృష్ణభారతిని 2022లో భీమవరంలో అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేకంగా ఆహ్వానించి పాదాభివం దనం చేసి సత్కరించారు. ఆమె మృతితో తాడేపల్లి గూడెంలో విషాద చాయలు అలముకున్నాయి.

కృష్ణభారతి సేవలు మరువలేం

స్వాతంత్ర్య పోరాట చరిత్రకు ఆనవాలు చెందిన కృష్ణభారతి. ఆ మృతి కలచి వేసింది. ఆమె సేవలు మరువలేం. ఆమె కుటుంబం స్వాతంత్ర పోరాటంలో ఎన్నో త్యాగాలు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమానికి ఆనవాలుగా ఉన్న చిట్టచివరి మహిళగా ఆమె లేని లోటు తీర్చలేనిది.

బొలిశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్యే



ఆమె జీవితం స్ఫూర్తిదాయకం

కృష్ణభారతి గాంధేయవాదిగా అతి నిరాడంరంగా జీవించారు. ఆమె జీవితం మాకు స్ఫూర్తిదాయకం. పేద విద్యార్థుల చదువుకు ఆమె ఎంతగానో తోడ్పాడ్డారు. ఆమె దాతృత్వ కార్యక్రమాలు తమకు ఎంతో స్ఫూర్తిని కలిగించాయి. మా మేనత్త మాకు ఎంతో గర్వకారణం.

భోగిరెడ్డి ఆదిలక్ష్మి



స్ఫూర్తిదాయక మహిళను కోల్పోయాం

కృష్ణభారతి మృతి విచారం కలిగించింది. స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో అంజలక్ష్మి, పసల కృష్ణమూర్తి దంపతులది ప్రత్యేక స్థానం. తల్లిదండ్రుల త్యాగాలు, పోరాట స్ఫూర్తితో కృష్ణ భారతి గాంధేయవాదిగా, సంఘ సేవకురాలిగా, జాతీయ ఉద్యమాలకు కట్టుబడి పనిచేశారు. ఆమె మృతితో స్వాతంత్ర్య ఉద్యమ కాలంనాటి ఒక స్ఫూర్తి దాయక మహిళను తాడేపల్లిగూడెం పట్టణం కోల్పోయింది.

డి.సోమసుందర్, ఐజేయూ జాతీయ కార్యదర్శి

కాపులకు రిజర్వేషన్లు కల్పించాలి

కాపు ఐక్య వేదిక డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తణుకు రూరల్ మార్చి 23, (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో మరాఠాలకు మాదిరి మన రాష్ట్రంలో కాపులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఉత్తరాంధ్ర కాపు ఐక్యవేదిక చైర్మన్ పి.వెంకట రాయలు డిమాండ్ చేశారు. పైడిపర్రులోని కాపు కళ్యాణ మండపంలో ఆదివారం కాపు ఐక్య వేదిక, సోషల్ జస్టిస్ ఫోరం ఆధ్వర్యంలో కాపు ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ రావి శ్రీనివాసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాపు యువత ఉపాధికి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కాపు కార్పొరేషన్‌కు రూ.3 వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏ ఏడాదికి కేటాయించిన నిధులు ఆ ఏడాదిలోనే ఖర్చు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జె.నాగబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కాపుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కోరారు. సోషల్ జస్టిస్ ఫోరం అధ్యక్షుడు జంగాల సింగరయ్య యాదవ్ మాట్లాడుతూ బీసీలకు, ఈడబ్ల్యూఎస్ వారికి ఇబ్బంది లేకుండా కాపులకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలు, కాపుల ఐక్య వేదిక ద్వారానే రాజ్యాధికారం దక్కుతుందన్నారు. సమావేశంలో బీసీ ఐక్య వేదిక నాయకులు దానా గౌడ్, సూర్య సాగర్‌బాబు, కాపు ఐక్యవేదిక మహిళా నాయకురాలు వెంకటలక్ష్మి, కాకిలేటి సత్యవాణి, కొమ్మిరెడ్డి రమాదేవి, దూలం చిట్టిపాప, కాకిలేటి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

యువతిపై అత్యాచారం : ఏడుగురిపై పోక్సో కేసు

ఏలూరు క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): యువతిని ప్రేమిస్తున్నానని నమ్మించి ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా శారీరక సంబంధం కొనసాగించాడు. అతడితో పాటు అతడి స్నేహితులు కూడా తమ వద్ద వీడియోలు ఉన్నాయని, తమతో వివాహేతర సంబంధం కొనసాగించకపోతే సోషల్ మీడియాలో పెడతామని బెదిరించారు. వారు కూడా ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. విషయం తెలిసి బాధితురాలి తల్లిదండ్రులు ప్రశ్నించడంతో వారిని కూడా బెదిరించారు. దీంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏడుగురిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఏలూరులోని ఓ ప్రాంతానికి చెందిన యువతి (18)ని జేపీ నగర్‌కు చెందిన ఆళ్ల వంశీకృష్ణ ప్రేమిస్తున్నానని నమ్మబలికాడు. ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా గత ఏడాది ఆగస్టులో ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. తర్వాత పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. అంతే కాకుండా అతని స్నేహితులైన యానాదుల సాయిచరణ్, చిట్లూరి శివశంకర్ కూడా ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఈకేసుకు సంబంధించి పోక్సో కేసు నమోదుచేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న ముద్దరబోయిన

ఘనంగా ముద్దరబోయిన జన్మదిన వేడుకలు

నూజివీడు టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలను నూజివీడు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని చాట్రాయి, ఆగిరిపల్లి, నూజివీడు, ముసునూరు మండలాలకు చెందిన పలువురు నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

చాట్రాయి: మాజీ ఎమ్మెల్యే, నూజివీడు నియోజకవర్గ మాజీ టీడీపీ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా చాట్రాయి మండలం నుంచి పలువురు టీడీపీ నాయకులు ఆదివారం నూజివీడు వెళ్ళి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చాట్రాయి మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పలగాని దుర్గారావు, టీడీపీ నాయకులు నాగమల్లి వెంకటేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతకు భగత్ సింగ్ స్ఫూర్తికావాలి



చిన్నంపేటలో భగత్ సింగ్ వర్ధంతి

చాట్రాయి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపేట సిద్ధార్థ హైస్కూల్, తుమ్మగూడెం ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ 94వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారిపై అలుపెరగని పోరాటం చేసిన యువ పోరాట యోధులు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లు వారి ప్రాణాలను త్యాగం చేసి అశువులు బాశారని కొనియాడారు. ఈ నాయకులను యువత స్ఫూర్తిగా తీసుకుని దేశం కోసం పనిచేయటమే నిజమైన నివాళి అవుతుంది అన్నారు. కార్యక్రమంలో సిద్ధార్థ హైస్కూల్ ప్రిన్సిపాల్ పలగాని శ్రీనివాస రావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, సామాజిక చైతన్య వేదిక కన్వీనర్ ఈవీ శ్రీనివాసరావు, హెచ్‌ఎం వెంకట రావు పాల్గొన్నారు.

ముసునూరు: స్వాతంత్ర సమరయోధుడు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల పోరాట పటిమ నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం మండల కార్యాదర్శి కొడవలి శ్రీనివాస్ అన్నారు. ముసునూరులో భగత్ సింగ్ 94వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి శ్రీనివాస్ నివాళులు అర్పించారు.



జనార్దనవరంలో పశువులకు వైద్య సేవలు

చాట్రాయి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జనార్దనవరంలో మండల వైద్య పశువైద్యాధికారి డాక్టర్ శివ నాగేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం పశువులకు వ్యాక్సినేషన్ నిర్వహించారు. అంతుచిక్కని వ్యాధితో గేదె, దూడలు మృతి శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. కొన్ని పశువులకు డి వార్మింగ్ మందులు అందజేశారు. పశువులకు రోగాలకు రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై పశు పోషకులకు అవగాహన కల్పించారు. సోమవారం గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించి పశువులన్నింటికీ చికిత్సలు అందిస్తాయని వైద్యాధికారి డాక్టర్ శివ నాగేంద్ర చెప్పారు.



ఇసుక తవ్వకాలకు అధికారుల బ్రేక్

ముదినేపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం చిగురుకోట ఏరియాలో నిర్వహిస్తున్న బుసక తవ్వకాలకు రెవెన్యూ అధికారులు బ్రేక్ వేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా బుసక తవ్వకాల పేరుతో చేపల చెరువులను తవ్వుతున్నారన్న గ్రామస్థుల ఫిర్యాదులతో అధికారులు ఆదివారం రంగంలోకి దిగారు. ఆ గ్రామ ఏరియాలో యధేచ్ఛగా జరుగుతున్న బుసక తవ్వకాలను, రవాణాను అడ్డుకున్నారు. తహసీల్దార్ సుభానీ ఆదేశాలతో వీఆర్‌ఓ యేసుబాబు, ఇతర సిబ్బంది పొలాల్లో జరుగుతున్న బుసక తవ్వకాలను నిలిపేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



టీడీపీలో చేరిన వైసీపీ ఎంపీటీసీలకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

ఆరుగురు ఎంపీటీసీలు కూటమిలో చేరిక

కైకలూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27వ తేదీన కైకలూరు మండల పరిషత్ వైస్ ఎంపీపీ పదవికి ఎన్నిక జరగనున్న నేపథ్యంలో వైసీపీకి చెందిన ఆరుగురు ఎంపీటీసీలు ఎమ్మెల్యే కామినేని సమక్షంలో కూటమి తీర్థం తీసుకున్నారు. ఆరుగురు ఎంపీటీసీల్లో ఘంటసాల నాగమణి, బలే నరేష్, సైదు లక్ష్మీ, పందు గాంధీప్రసాద్ తెలుగుదేశంపార్టీలో చేరారు. జనసేనపార్టీలో నల్లగచ్చు ధనలక్ష్మీ, కరణం వెంకట లక్ష్మీదుర్గా శ్రీదేవి జనసేనపార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సహజ కవి బెనర్జీకి ప్రశంసలు



మాట్లాడుతున్న దండే బెనర్జీ

కైకలూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బోయి భీమన్న జీవితం - సాహిత్యం అనే అంశంపై కైకలూరుకు చెందిన సహజకవి దండే బెనర్జీ రచనలకు గాను ఘనంగా సన్మానించారు. ఆదివారం రాజమహేంద్రవరంలో రాష్ట్రప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ బుక్ రికార్డ్స్(టీఎన్‌ఏ) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బోయి భీమన్నపై దండే బెనర్జీ రచించిన సాహిత్యానికి ప్రశంసలు అందుకున్నారు.

పూర్తయిన గుర్వాయిపాలెం - కొత్తూరు రహదారి



కలిదిండి, మార్చి 23 (ఆంధ్ర జ్యోతి): గుర్వాయిపాలెం - కొత్తూరు గ్రామాల ప్రధాన రహదారి గుంతల పడి అధ్వానంగా ఉండేది. దీంతో వాహనాలు గుంతల్లో దిగబడిపోయి ట్రాఫిక్ స్తంభించటంతో వాహనదారులు అవస్థలు పడేవారు. బస్సుల రాకపోకలకు అంతరాయం కలుగుతుండేది. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చొరవతో రూ.80 లక్షలతో గుర్వాయిపాలెం - కొత్తూరు రహదారికి మరమ్మతులు చేపట్టి పూర్తి చేశారు. దీంతో ఆర్టీసీ బస్సులు యథావిధిగా రాకపోకలు సాగించటంతోపాటు వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రంగస్థల కళాకారుడికి సత్కారం



కలిదిండి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కలిదిండికి చెందిన ప్రముఖ రంగ స్థల కళాకారుడు మావులూరి బాబురావును ఆదివారం మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో కళ్యాణి ఫంక్షన్ హాలులో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మానవత అధ్యక్షులు పూర శ్రీధర్ మాట్లాడుతూ రంగస్థలం నాటకాల్లో రాణిస్తూ ఎంతో మంది కొత్త వారిని నాటక రంగానికి పరిచయం చేశారని, కలిదిండికి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మానవత చైర్మన్ పేటేటి వివేకానంద, ఇంటి సత్యనారాయణ, మల్లిఖార్జునరావు, సుధాకర్, గోదావరి సత్యనారాయణ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు

ముదినేపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ముదినేపల్లిలోని అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించిన ఎన్‌హెచ్ అధికారులు ఆదివారం తిరిగి ఏర్పాటు చేశారు. సుమారు మూడు నెలల క్రితం జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అధికారులు స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని క్రేన్‌తో తొలగించి స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణలో ఉంచారు. తమకు ముందుగా చెప్పకుండా అధికారులు అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించి క్రేన్‌తో వేలాడదీసుకుంటూ తరలించటంపై విగ్రహ నిర్మాణ కమిటీ నాయకులు, దళిత సంఘాల నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం గతంలో విగ్రహం ఉన్న ప్రదేశానికి సమీపంలో రోడ్డు విస్తరణకు ఆటంకం లేకుండా దిమ్మ నిర్మించి అదే అంబేడ్కర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేశారు.

ఈ నెల 26న కైకలూరులో జాబ్‌మేళా

కైకలూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఈ నెల 26వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వైశ్రీలత తెలిపారు. ఈ మేళాకు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18 నుంచి 35సంవత్సరాలు కలిగిన వారు అర్హులున్నారు. ఈ జాబ్ మేళాకు హాజరయ్యేవారు తమ బయోడేటా, సర్టిఫికెట్ల నకళ్లతో రావాలన్నారు. మరిన్ని వివరాల కోసం సెల్ నెంబర్లు 97013 57315, 62811 19575 టోల్ ఫ్రీ నెంబర్ 9988853335 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

సీఎం సహాయనిధి మంజూరు

ముదినేపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలోని ముగ్గురు వ్యక్తులకు ఆసుపత్రుల్లో వైద్యఖర్చుల బిల్లులు చెల్లింపునకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.4.74 లక్షలు మంజూరైనట్లు తెలుగుదేశం పార్టీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు తెలిపారు. ముదినేపల్లికి చెందిన ఆలపాటి వెంకట రాంప్రసాద్‌కు రూ.2.08 లక్షలు, కోడూరు గ్రామానికి చెందిన అడుసుమిల్లి వెంకటేశ్వరరావుకు రూ.1.71 లక్షలు, ఈడేపల్లి గ్రామానికి చెందిన లోకం మోహన్ బాబుకు రూ.94,810 మంజూరైనట్లు తెలిపారు.

అక్షరాస్యతపై మహిళలకు అవగాహన

ముదినేపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వయోజనులైన మహిళల్లో అక్షరాస్యతను పెంచేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమాన్ని ఆదివారం ముదినేపల్లి మండలంలో నిర్వహించారు. వెలుగు శాఖ మండల ఏపీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఈ కార్యక్రమంపై అవగాహన కలిగించి మహిళలకు పరీక్షలు నిర్వహించారు. డ్వాక్రా గ్రూపుల సభ్యులు అధిక సంఖ్యలో ఉల్లాస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీసీలు కల్పన, సత్యవర్ధన్ పాల్గొన్నారు. అల్లూరులో జరిగిన కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు పాల్గొన్నారు.

విద్యా మౌలిక వసతులతో ఆర్జీయూకేటీ అగ్రగామి



నూజివీడు టౌన్, మార్చి 23 (ఆంధ్ర జ్యోతి): విశ్వవిద్యాలయాలలో ఆర్జీకేటీ విద్య మౌలిక వసతుల కల్పన పరంగా అగ్రస్థానంలో ఉందని ఆర్జీయూకేటీ వీసీ విజయ్‌కుమార్ అన్నారు. నూజివీడు ట్రిబుల్ ఐటీ క్యాంపస్‌లో ఎట్టర్ నాక్స్ (పూర్వ విద్యార్థుల సమావేశం) రెండవ రోజు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలను పరిశ్రమలతో అనుసంధానం చేస్తూ భవిష్యత్ తరాలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్లు ఎస్ అమరేంద్రకుమార్, భాస్కర్ పటేల్, బాలాజీ ఏవోపీ లక్ష్మణ రావు పాల్గొన్నారు.

పది లీటర్ల సారా స్వాధీనం

చింతలపూడి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : నాగిరెడ్డిగూడెం వెళ్లే మార్గంలో మొక్కజొన్న ఫ్యాక్టరీ వద్ద ఎక్సైజ్ అధికారులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పది లీటర్ల సారాను పట్టుకున్నారు.చాట్రాయి మండలం కొత్త గూడేనికి చెందిన ఇరువురు మోటారు సైకిల్‌పై పది లీటర్ల సారా తరలిస్తుండగా పట్టుకున్నట్టు తెలిపారు. సారాతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని ముల్లంగి శ్రీనివాసరావు, రామేశ్వరం అనే ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు.